Crime Mirror QR Code

https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
25-10-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:13
సంచిక: 351

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# ఆదాయం తగ్గింది.. మార్చి దాకా అడగొద్దు



- ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీకి స్పష్టం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- కొన్నాళ్లుగా వివిధ శాఖల ఆదాయం తగ్గింది
- ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది
- ఆదాయం పెంచుకునేందుకు సహకరించండి
- ఆర్థికేతర సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపుతాం..
- డీఏలు ఇచ్చే అంశంపై ఆలోచన చేస్తాం
- 317 జీవో సమస్యలను పరిష్కరిస్తామని హామీ
- ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి భట్టి సారథ్యంలో మంత్రుల కమిటీ ఏర్పాటు
- దీపావళి తర్వాత ఉద్యోగ సంఘాలతో చర్చలు

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని.. వచ్చే మార్చి 31 వరకు ఎలాంటి ఆర్థికపరమైన ఒత్తిడులు చేయవద్దని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

- మిగతా 2వ పేజీలో



## ప్రజలు, రైతుల కోసం జైలుకు వెళ్లడానికి సిద్ధమే

- ఒకటి రెండేళ్లు జైలులో ఉండడానిఇ వెనకాడం
- కాంగ్రెస్ చీటింగ్‌పై అందరూ కలసికేసులు పెట్టాలి
- రైతుబంధు, రుణమాఫీ చేయనందుకు నిలదీయాలి
- ఆదిలాబాద్ సభలో పార్టీ శ్రేణులకు కెటిఆర్ పిలుపు

**ఆదిలాబాద్,(క్రైమ్ మిర్రర్):** ఈ రాష్ట్ర ప్రజలు, రైతుల సంక్షేమం కోసం జైలుకు పోవడానికి కూడా రెడీగా ఉన్నానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. జైలుకు పోవడానికి రెడీ.. ప్రజలు, రైతుల కోసం ఒకట్రెండు ఏండ్లు జైల్లో ఉండేందుకు సిద్ధం. ఎవనీ అయ్యకు భయపడేది లేదు. తప్పకుండా కాంగ్రెస్‌ను ఉరికించి కొట్టే రోజులు దగ్గర పడ్డాయి. అసలు చీటింగ్ కేసులు ఎవరి మీద పెట్టాలి.. తులం బంగారం ఇస్తామని చెప్పి మోసం చేసిన ఈ చార్ సౌ బీస్‌గాని మీద కేసులు పెట్టాలి. రైతుబంధు ఎగ్గొట్టి, రుణమాఫీ చేయనందుకు రైతులు కేసులు పెట్టాలి. 2 లక్షల ఉద్యోగాలని చెప్పి..



## సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్

- రూ.358 కోట్ల విడుదల కు సింగరేణికి భట్టి ఆదేశం
- గతం కన్నా 50 కోట్లు అదనమని వెల్లడి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** దీపావళి కానుకగా సింగరేణి కార్మికులకు బోనస్‌ను శుక్రవారమే చెల్లిస్తున్నామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సచివాలయంలో ప్రకటించారు. దీని కోసం సింగరేణి సంస్థ రూ.358 కోట్లను విడుదల చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌ను ఆదేశించారు.

10లో



## విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదన సరికాదు

- ప్రజలపై భారం మోపే ఆలోచన మానాలి
- చిన్నతరహా పరిశ్రమలకు గుదిబండ కారాదు
- ఇఆర్‌సి ముందు ఎమ్మెల్యే వేముల వాదన

**నిజామాబాద్, (క్రైమ్ మిర్రర్):** రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన విద్యుత్ డిస్కంలు వివిధ కారణాలు చెప్పి18,500 కోట్ల రూపాయల విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపేందుకు సిద్ధమైందని బిఆర్ఎస్ ఆరోపిస్తోంది. రూ.963 కోట్ల ట్రూ అప్ ఛార్జీలు, రూ.16,364 కోట్ల విద్యుత్ ఛార్జీలు ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1,200 కోట్ల విద్యుత్ ఛార్జీల పెంపు కోసం విద్యుత్ సంస్థలు పిటిషన్లు దాఖలు చేశాయి. వాటిని వెంటనే తిరస్కరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనలపై విద్యుత్తు నియంత్రణ మండలి గురువారం నిజామాబాద్ కలెక్టరేట్ చేపట్టిన బహిరంగ విచారణలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, విజి గౌడ్ తదితరులు పాల్గొని కమిషన్ సభ్యుల ముందు తమ వాదనలు వినిపించారు. ఈ వసందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ..ఇళ్లకు వాడుకునే కరెంటు నెలకు 300 యూనిట్లు దాటితే కిలోవాట్‌కు ఫిక్స్‌డు ఛార్జీని ప్రస్తుతం రూ.10 వసూలు చేస్తుండగా దాన్ని రూ.50 కి పెంచాలని డిస్కంలు కోరటం సరికాదన్నారు. ఇటీవల కాలంలో విద్యుత్ వినియోగం అనేది చాలా పెరిగిపోయింది.

మిగతా 2లో

## రూ.300 కోట్లతో 'షూఆల్స్' కర్మాగారం!

మంత్రి శ్రీధర్‌బాబుతో దక్షిణ కొరియా షూ కంపెనీ చైర్మన్




మిగతా 2లో



## కొత్త రైల్వేలైన్‌తో అమరావతి అనుసంధానం

- కేంద్రానికి సిఎం చంద్రబాబు కృతజ్ఞతలు
- రాష్ట్రంలోని ప్రాజెక్టులకు 3 నెల్లలో భూ సేకరణ
- రహదారుల అభివృద్ధికి ప్రత్యేక స్థానం
- వర్చువల్‌గా పాల్గొన్న సిఎం, డిప్యూటి సిఎం

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** అమరావతికి రైల్వేలైన్ మంజూరు చేసిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఏపీ

## యూపీ ఉప ఎన్నికలకు కాంగ్రెస్ దూరం

- తొమ్మిది స్థానాల్లోనూ పోటీ చేయనున్న ఎస్పీ
- సీట్లు కాదు.. గెలుపే ముఖ్యమన్న అఖిలేశ్

న్యూఢిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్ ఉప ఎన్నికల్లో తమ పార్టీ



## వరంగల్‌లో రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్

- రూ.650 కోట్ల వ్యయంతో ఏర్పాటు
- యాదాద్రి వరకు ఎంఎంటిఎస్ పొడిగింపు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి





# ఆదాయం తగ్గింది.. మార్చి దాకా అడగొద్దు



(మొదటి పేజీ తరువాయి)

ఆర్థికేతర అంశాలను తక్షణమే పరిష్కరించేందుకు సర్కారు సిద్ధంగా ఉందని.. దీనికి సంబంధించి మంత్రులతో కమిటీ వేస్తున్నామని తెలిపారు. ఆందోళన బాట పడతామని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జేఏసీ ప్రతినిధులతో సీఎం రేవంత్ గురువారం సమావేశమయ్యారు. సుమారు రెండున్నర గంటల పాటు జరిగిన ఈ చర్చల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి జేఏసీ నుంచి హాజరైన 36 మందికి మాట్లాడే అవకాశం కల్పించారు. వారు చెప్పిన అంశాలు, సమస్యలను విన్నారు. అనంతరం ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రతినిధులను ఉద్దేశించి సీఎం రేవంత్ 15 నిమిషాల పాటు మాట్లాడారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన 5 డీఏలను తక్షణమే విడుదల చేయాలని సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. కనీసం మూడు డీఏలను వెంటనే ఇవ్వాలని.. 26న జరిగే మంత్రివర్గ సమావేశంలో డీఏలపై ప్రకటన చేయాలని కోరారు. దీనిపై సీఎం రేవంత్ స్పందిస్తూ.. సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని, ఏమాత్రం వీలైనా ఎంతో కొంత న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. పెండింగ్ బిల్లులు, నగదు రహిత ఆరోగ్య కార్డుల జారీ అంశాన్ని సీరియస్‌గా పరిశీలిస్తున్నామని తెలిపారు. డీఏల విషయంలో ప్రభుత్వానికి ఒకట్రెండు రోజులు సమయం ఇవ్వాలని కోరారు.

**317 జీవో సమస్యలను పరిష్కరిస్తాం..**


స్థానిక జిల్లాలకు ఉద్యోగుల బదిలీ కోసం తీసుకొచ్చిన 317 జీవోతో ఏర్పడ్డ సమస్యలను పరిష్కారిస్తామని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ భరోసా ఇచ్చారు. ఈ అంశంపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం ఇచ్చిన సీల్డ్ కవర్ నివేదికను శుక్రవారం ఉద్యోగ ప్రతినిధుల ముందే తెరుస్తామని చెప్పారు. అందులోని అంశాలను పరిశీలించి, తగిన సలహాలు ఇస్తే.. సమస్యలన్నీ పరిష్కారం అయ్యే దిశగా కేబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామన్నారు.

**భట్టి నేతృత్వంలో మంత్రుల కమిటీ..**

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో.. మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబులతో కమిటీ వేస్తున్నట్టు సీఎం రేవంత్ వెల్లడించారు. దీపావళి పండుగ తర్వాత ఈ కమిటీ సంఘాల నేతలతో సంప్రదింపులు జరుపుతుందని.. ఈ క్రమంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వానికి సూచనలు చేస్తుందని తెలిపారు. సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శి జనరల్ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, కో%-%చైర్మన్ చావా రవితోపాటు పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజలు, రైతుల కోసం

# జైలుకు వెళ్లడానికి సిద్ధమే



ఇప్పటి వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వనందుకు యువత కేసులు పెట్టాలి. ఇలా అన్ని వర్గాలు పోలీసు స్టేషన్ల ముందు లైన్లు కట్టి చీటింగ్ కేసు పెడితే ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా ఈ రాష్ట్రంలో మిగలడు అని కేటీఆర్ తెలిపారు. తప్పకుండా కాంగ్రెస్ పార్టీ నేతలను ఉరికించి కొట్టే రోజులు దగ్గర పడ్డాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని రామ్‌లీలా మైదానంలో ఏర్పాటు చేసిన రైతన్నల ధర్నాలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్ నుంచి ఉదయం ఏడున్నరకు వెల్లినం.. కానీ కాంగ్రెస్ పాలన ఎట్ల ఉందంటే.. అన్ని పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. మేడ్చల్ వద్దనే 45 నిమిషాలు పట్టింది. ఇక డిచ్‌పల్లి వద్ద కొందరు మహిళలు రోడ్డుకు అడ్డంగా కూర్చుని ధర్నా చేస్తున్నారు. ఏం కష్టమొచ్చింది అని దిగాను. వాళ్లు పోలీసోళ్ల భార్యలు. వన్ పోలీసింగ్ కావాలని డిచ్‌పల్లి బెటాలియన్ వద్ద ధర్నా చేస్తున్నారు. ధర్నా చేస్తున్న మమ్మల్ని రక్తం కారేలా గుంజుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఆ ఆడబిడ్డలు. అఖరికి కాంగ్రెస్ పాలనలో పోలీసోళ్ల భార్యలు ధర్నాలు చేసే పరిస్థితి.. వారు కూడా పోలీసోళ్ల చేతిలో దెబ్బలు తినే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ మండిపడ్డారు. పోలీసులను కోరుతున్నా.. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. ఇలాంటి కిరాతక పనులు బీఆర్‌ఎస్ పాలనలో చేయలేదు. మంత్రినో, కంత్రినో ఫోన్ చేస్తే ఆగం కాకండి.. న్యాయం, ధర్మం ప్రకారం నడుచుకోండి. పోలీసులైనా, అధికారులైనా ఎక్స్‌ట్రాలు చేస్తే పేర్లు రాసిపెట్టి మిత్తితో సహా ఇస్తాం. రేవంత్ రెడ్డి రాజు, చక్రవర్తి కాదు. చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి లాంటి నాయకులతోనే కొట్లాడినం.. వీడెంత చిట్టినాయుడు.. గింతంత మనిషి.. వాని చూసి ఆగం కావొద్దు. ఉద్యోగులు పద్ధతి ప్రకారం ఉద్యోగం చేయండి. అతికి పోతే మా టైమ్ వచ్చాక మిత్తితో సహా ఇస్తామని కేటీఆర్ హెచ్చరించారు. దే ఆదిలాబాద్‌లో ఖానాపూర్ చెరువు వద్ద 2 వేల ఇండ్లు కూలగొట్టేందుకు అధికారులు వెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఆ ఇండ్లకు పర్మిషన్లు, పట్టాలు ఇచ్చారు. బాధితుడు బొడిగెం గంగన్న

నాలుగు తిట్లు తిట్టిండు. ఇల్లు కూలగొడితే ఎవడన్న ఊకుంటాడా..? ఆయన తిట్టిండని ఆయన మీద కేసు పెట్టారు.. జైల్లో పెడుతారట.. వంద రోజుల్లో అన్ని చేస్తానని తప్పించుకున్న లుచ్చాగాళ్ల మీద కేసులు పెట్టాల్నా.? పేదల మీద కేసులు పెట్టాల్నా..? అల్లం బెల్లం ఇస్తామని అడ్డగోలు మాటలు చెప్పి రైతులను మోసం చేస్తున్న లుచ్చాగాళ్లపై చీటింగ్ కేసులు పెట్టాలి. రైతుల మీద కేసులు పెడుతాం అంటే ఊరుకునేందుకు సిద్ధంగా లేమని కేటీఆర్ తేల్చిచెప్పారు.

## సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్

రాష్ట్ర సచివాలయంలో సింగరేణిపై జరిగిన సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది చెల్లించిన దీపావళి బోనస్ కన్నా ఇది రూ.50 కోట్లు అధికం కావడం విశేషం. శుక్రవారం మధ్యాహ్నం సమయానికి దీపావళి బోనస్‌ను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. దీపావళి బోనస్ కింద ఒక్కొక్క కార్మికుడు రూ.93,750లు అందుకోనున్నారు. సంస్థలో పనిచేస్తున్న దాదాపు 40,000 మంది కార్మికులకు ఈ బోనస్ అందనుంది. బొగ్గు పరిశ్రమ కోసం జేబీసీసీఐ విధానాల్లో భాగంగా కంపెనీలు సాధించిన ఉత్పత్తి పరిమాణం ఆధారంగా కార్మికుల శ్రమకు ప్రోత్సాహకంగా ఈ బోనస్‌ను చెల్లించే పద్ధతి గత కొన్నేళ్లుగా అమలులో ఉంది. ఈ ఏడాది కూడా కోల్ ఇండియా స్థాయిలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా దీపావళి పండుగకు ముందే చెల్లింపులు జరిగేలా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలిచ్చారు. ఇటీవలే సింగరేణి ఉద్యోగులందరికీ 33 శాతం లాభాల వాటా కింద రూ.796 కోట్లను కంపెనీ పంపిణీ చేసిందని సింగరేణి సీఎండీ తెలిపారు.

## యూపీ ఉప ఎన్నికలకు కాంగ్రెస్ దూరం

(మొదటి పేజీ తరువాయి)

తరఫున అభ్యర్థులను నిలబెట్టకూడదని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ప్రస్తుతం ఎన్నికలు జరగనున్న తొమ్మిది స్థానాలను ఇండియా కూటమిలో భాగంగా ఉన్న సమాజ్‌వాదీ పార్టీకే వదిలేయడంతో పాటు ఆ పార్టీ అభ్యర్థులకే మద్దతివ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు కాంగ్రెస్ నిర్ణయం చేసిందని ఆ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ అవినాష్ పాండే గురువారం తెలిపారు. నిజానికి ప్రాండే ప్రకటనకు ముందే ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఉప ఎన్నికల్లో మొత్తం తొమ్మిది స్థానాల్లో ఇండియా కూటమి అభ్యర్థులందరూ తమ పార్టీ ఎన్నికల గుర్తు 'సైకిల్'పై పోటీ చేస్తారని ప్రకటించారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు ఐక్యంగా ఉన్నాయని, భారీ విజయం కోసం భుజం భుజం కలిపి పనిచేస్తాయని, ఈ ఎన్నికల విజయంతో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తామని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అఖిలేశ్ ప్రకటన అనంతరం కాంగ్రెస్ తన నిర్ణయాన్ని అధికారికంగా వెల్లడించింది. నిజానికి ప్రస్తుతం ఎన్నికలు జరుగనున్న 9 స్థానాలకు గానూ కాంగ్రెస్ 5 స్థానాలను ఆశించింది. దీనిపై చర్చలు కొనసాగుతుండగానే 6 స్థానాల్లో ఎస్పీ ఏకపక్షంగా అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన మూడు స్థానాల్లో ఘాజియాబాద్, ఖైర్ స్థానాల్లో కాంగ్రెస్‌కు ఇచ్చేందుకు సుముఖత తెలిపింది.

# విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదన సరికాదు

ఎండాకాలం వచ్చిదంటే చాలు 300యూనిట్ల విద్యు త్ వినియోగం సాధారణమైందని పేర్కొన్నారు. ఇది ప్రజలపై పెను భారం మోపుతుంది. వారిని ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. 300 యూనిట్లు పై వాడే మధ్య తరగతి ప్రజలకు దీనివల్ల ప్రతి నెల వేల రూపాయల భారం పడుతుంది. ఇంత పెద్ద ఎత్తున విద్యుత్ ఛార్జీలు పెంచాలని ప్రతిపాదించటం సమంజసం కాదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో సవాళ్లు ఎదుర్కొని ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించిందని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ కేవలం ఒక వ్యాపార వస్తువుగా చూడటం దురదృష్టకరమన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలన్నారు.చిన్న పరిశ్రమలకు, భారీ పరిశ్రమలకు ఇచ్చే కరెంట్ కు ఒకే విధమైన రేటు కట్టటమంటే ఒక విధంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు ఉరి వేస్తున్నట్లేనని అన్నారు. నిర్ణయం కారణంగా రాష్ట్రంలో ఉన్న ఎస్ఎంఎస్ఈ మొత్తం రోడ్డున పడే పరిస్థితి వస్తుంది. దాంతో లక్షల మంది ఉపాధి కోల్పోతారు.

పరిశ్రమలన్నింటినీ ఒకే గాటున కట్టాలని భావించటం దుర్మా ర్గం. దీని కారణంగా సిరిసిల్ల, కాటేదాన్ సహా చాలా ప్రాంతాల్లో ప్రభుత్వం ఇచ్చే విద్యుత్ సబ్సిడీలు బంద్ అయ్యే పరిస్థితి ఉంటుంది దీంతో వేలాది మంది ఉపాధి పై ప్రభావం చూపుతుందని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో పారిశ్రామిక రంగంలో మందగమనం మొదలైంది. చాలా కంపెనీలు రాష్ట్రాన్ని వీడి వెళ్తున్నాయి. ఫాక్స్

కాన్ లాంటి సంస్థ తన కంపెనీ విస్తరణను విరమించుకుంది. లాంటి పరిస్థితుల్లో పరిశ్రమలను కాపాడుకోవటానికి వీలైనంత వరకు వారికి ప్రోత్సహాకాలు ఇవ్వాలి. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న పరిశ్రమలు కూడా ఆగమయ్యే విధంగా విద్యుత్ ఛార్జీలను పెంచాలని ప్రయత్నిస్తోంది. ఉచిత విద్యుత్ భారాన్ని మధ్యతరగతి, చిన్న పరిశ్రమలు, భారీ పరిశ్రమలపై వేయాలని ఆలోచిస్తోంది. వారి ఆనాలోచిత నిర్ణయాల కారణంగా మొత్తం రాష్ట్ర అభివృద్ధి కుంటు పడే ప్రమాదం ఉంది. డిస్కంలు ప్రతిపాదించిన 9 ప్రతిపాదనలను తిరస్కరించాలి. డిస్కంలు చేస్తున్న ప్రతిపాదనల వెనుక ఖచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వమే డిస్కంల పేరుతో ప్రజల నడ్డి విరిచేందుకు దొడ్డి దారిలో ప్రయత్నాలు చేస్తోందన్నారు. నిజానికి ఈ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అంటూ అధికారంలోకి వచ్చింది. ఎప్పుడు దాన్ని ఎలా అమలు చేయాలో తెలియక అసంబద్ధ నిర్ణయాలు తీసుకొంటోంది. ట్రూ అప్ ఛార్జీలు, తక్షణం విద్యుత్ ఛార్జీల పెంపు అంటూ కాంగ్రెస్ పార్టీ ప్రజలపై భారాన్ని మోపేందుకు తొందరపడుతోంది. కనుక ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ ఛార్జీల పెంపు అనేది రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తుంది. ఇప్పటికే ఈ ప్రభుత్వం విద్యుత్ సరఫరా లో వైఫల్యం చెందటంతో ప్రజలు, రైతాంగం విసిగిపోయి ఉన్నారు. ఇ÷ుద్యుత్ ఛార్జీల పెంపు ద్వారా జరిగే అనర్థాలను పరిగణలోకి తీసుకోకుండా ఈ ప్రభుత్వం మూర్ఖంగా వ్యవహరిస్తోంది.విద్యుత్ ను ప్రజల జీవనాడిగా ఉన్న ఒక ప్రాథమిక హక్కు గా భావించినప్పుడే ప్రజల జీవితాల్లో వెలుగులు నిండుతాయి. రాష్ట్రం ఏర్పడితే తెలంగాణ అంధకారం అవుతుందన్న విమర్శలకు దేశంలో ఎక్కడ లేని విధంగా 24 గంటల కరెంట్ ఇచ్చి అవన్నీ తప్పుడు ఆరోపణలని నిరూపించారు. ÷రాష్ట్ర రైతాంగానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తు నుంచి మొదలుకొని పారిశ్రామిక రంగానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేశాం. క్రమంలో కేసీఆర్ గారు విద్యుత్ రంగంలో ఎన్నో అవరోధాలను ఎదుర్కొని విజయాలు సాధించారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు 7 వేల మెగావాట్లు మాత్రమే ఉన్న విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 24 వేల మెగావాట్లకు తీసుకెళ్లారు. ÷ాణ్యమైన విద్యుత్ అందించేందుకు ట్రాన్ ఫార్మర్లు, విద్యుత్ లైన్లను ఆధునీకరించారు. మొత్తం విద్యుత్ రంగంలోనే సమూలమైన మార్పులు తెచ్చారు. క్రమంలో ఎంత ఖర్చైనా వెనుకడలేదు. పైగా ప్రజలపై భారం అసలే మోపలేదు. కేసీఆర్ ప్రభుత్వంలో కూడా డిస్కంలు విద్యుత్ ఛార్జీల పెంపును ప్రతిపాదిం చాయి కానీ ఆయన అందుకు ససేమిరా అన్నారు.ట్రూ అప్ ఛార్జీల పెంపునకు కూడా అనుమతి ఇవ్వకుండా దాదాపు 1200 కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరించింది.విద్యుత్ అనేది రాష్ట్ర ప్రగతికి ఇంజన్ లాంటిదని ఆయన భావించారు కనుకే విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపలేదు. దాని ఫలితాలు ఇవ్వాళ తెలంగాణలో కనిపిస్తున్నాయి రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా కారణంగా రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి నాలుగు రెట్లు పెరిగింది. ÷ూరీ పరిశ్రమలు, (ఎస్ఎంఎస్ఈ) లకు 24 గంటలు కరెంట్ సరఫరా చేయటంతో పరిశ్రమ వర్గాలు సంతోషంగా ఉన్నాయి. ఎస్ఎంఎస్ఈ రంగం లో తెలంగాణ సాధించిన అభివృద్ధి ని ఇటివలే కాంగ్రెస్ ప్రభుత్వమే నివేదిక విడుదల చేసింది. తెలంగాణ అభివృద్ధికి విద్యుత్ రంగంలో తీసుకొచ్చిన సమూల మార్పులు, ప్రజలపై ఎలాంటి భారం పడకుండా చేపట్టిన చర్యలే కారణం. ప్రభుత్వం విద్యుత్ ను కేవలం ఒక వ్యాపార వస్తువు గా చూడటం దురదృష్టకరం. లాంటి విద్యుత్ విషయంలో ఈ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. పరిశ్రమలు (ఎస్ఎంఎస్ఈ), గృహాలకు విద్యుత్ ఛార్జీలు అడ్డగోలుగా పెంచితే మొత్తం ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుంది.గతంలో ఎన్ని కష్టాలు వచ్చినా ఐఅఖీ గారు, అప్పటి డిస్కం లు ప్రజల పైన విద్యుత్ చార్జీల భారాన్ని వేయలేదు.

## కొత్త రైల్వేలైన్‌తో అమరావతి అనుసంధానం

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. అశ్వినీ వైష్ణవ్ నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఏపీ భాజపా అధ్యక్షురాలు పురంధేశ్వరి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. కొత్త రైల్వేలైన్ ఏర్పాటుతో అమరావతి దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానం కానుందన్నారు. విశాఖ రైల్వే జోన్ అంశం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉందని ఈ

సందర్భంగా గుర్తు చేశారు. భూసేకరణ సహా ఇతర అంశాల్లో రాష్ట్ర సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. రూ.45,300 కోట్లతో నాలుగు గ్రీన్‌ఫీల్డ్ రహదారుల నిర్మాణం జరగనుందని, 6 ప్రాజెక్టులు బిడ్డింగ్ దశలో ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. 15 ప్రాజెక్టులు నిలిచిపోయాయని, 75 ప్రాజెక్టులకు భూసేకరణ సమస్యలు, 23 ప్రాజెక్టులకు అటవీ అనుమతుల సమస్యలు ఉన్నాయన్నారు. మొత్తం 95 ప్రాజెక్టులకు వివిధ సమస్యలు ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలో చేపట్టబోయే ప్రాజెక్టులన్నింటికీ 3 నెలల్లో భూసేకరణ పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. బెంగళూరు-కడప-విజయవాడ ఎక్స్‌ప్రెస్ వేకు సమస్యలు ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టుకు 15 రోజుల్లో పర్యావరణ అనుమతులు సాధించా లన్నారు. నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. దాదాపు రూ.18 వేల కోట్లతో పనులన్నీ పూర్తి చేయనున్నట్లు చెప్పారు. రెండున్నరేళ్లలో రూ.50 వేల కోట్లతో పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. హైదరాబాద్ నుంచి మచిలీపట్నానికి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం జరగ నుందన్నారు. ఎకో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఏపీ మారనుందని తెలిపారు. ఆక్వా, హార్టికల్చర్ ఎగుమతులకు అవకాశాలు ఉన్నాయని చంద్రబాబు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు చరిత్రాత్మక రోజు అని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అభివర్ణించారు. ఎన్డీయే ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉందన్నారు. రాజధాని నుంచి ఏ ప్రాంతానికైనా అనుసంధానం చాలా కీలకమన్నారు. పది రోజుల స్వల్ప వ్యవధిలోనే కొత్త రైల్వే లైన్ ప్రతిపాదనలు కేబినెట్ ముందుకు తెచ్చారని చెప్పారు.

## వరంగల్‌లో రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్


హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 90 శాతం రైల్వేలైన్ల విద్యుదీకరణ జరిగిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌తో రాష్ట్ర ఎంపీల సమావేశం అనంతరం రైల్ నిలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామన్నారు. వరంగల్‌లో రూ.650 కోట్లతో రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దక్షిణ మధ్య రైల్వే బ్జడెట్‌ను పెంచామన్నారు.దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 5 వందే భారత్ రైళ్లు ఉన్నాయని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. మరిన్ని తీసుకొస్తామన్నారు. రూ.720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పనులు చేస్తున్నట్లు వివరించారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. యాదాద్రి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. దీనికి రూ.650 కోట్లు అవసరమని చెప్పారు. ఘట్‌కేసర్ వరకు ప్రస్తుతం ఎంఎంటీఎస్ సర్వీసు ఉందని.. అక్కడి నుంచి యాదాద్రి వరకు విస్తరించాల్సి ఉందని పేర్కొన్నారు.

## రూ.300 కోట్లతో 'షూఆల్స్' కర్మాగారం!

హైదరాబాద్: మెడికల్, స్మార్ట్ బూట్ల ఉత్పత్తిలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉన్న షూఆల్స్ కొరియన్ కంపెనీ తెలంగాణలో కర్మాగారం ఏర్పాటుకు ఆసక్తి వ్యక్తం చేసిందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. 750 ఎకరాలు కేటాయిస్తే రూ. 300 కోట్లతో అత్యాధునిక షూ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పుతామని చెప్పిందన్నారు. దక్షిణ కొరియా నుంచి వచ్చిన షూఆల్స్ చైర్మన్ చెవోంగ్ లీ, ఆ సంస్థ ప్రతినిధులు గురువారం సచివాలయంలో తనను కలిసినట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. 87 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించగల గిగా ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రతిపాదనను ప్రభుత్వం ముందు ఉంచారన్నారు.మెడికల్ చిప్‌తో కూడిన బూట్ల సోల్స్, జీపీఎస్ అమర్చిన బూట్లు, 10 వేల అడుగులు వేస్తే గంటకు 25 వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే బూట్లతోపాటు మధుమేహం, కీళ్ల నొప్పుల బాధితులకు నడకలో ఉపశమనం కలిగించే పలు రకాల ఉత్పత్తులను తాము తయారు చేస్తామని చెవోంగ్ లీ పేర్కొన్నట్లు శ్రీధర్‌బాబు వివరించారు.

# బ్యాంక్ ఆఫ్ బరోడా కోటి విరాళం

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు అందుతూనే ఉన్నాయి. తాజాగా బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.కోటి విరాళం అందజేసింది. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసిన బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్ రితేష్ కుమార్, డీజీఎం ఎంవీఎస్ సుధాకర్ లు ఇందుకు సంబంధించిన చెక్ ను అందజేసారు. దీనికి స్పందిస్తూ..వారికి సిఎం రేవంత్ అభినందనలు తెలిపారు.





## ఎట్టకేలకు జానీ మాస్టర్‌కు బెయిల్

### షరతులతో కూడిన బెయిల్ మంజూరు

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): లైంగిక వేధింపుల కేసులో నిందితుడిగా ఉన్న కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు బెయిల్ మంజూరైంది. తనని లైంగికంగా వేధించారన్న మహిళా కొరియోగ్రాఫర్ ఫిర్యాదు మేరకు ఆయనపై పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో రెండు వారాలుగా ఆయన చంచల్‌గూడ జైలులో ఉన్నారు. పోక్సో చట్టం కింద కేసు నమోదవడంతో ఆయనకు ప్రకటించిన నేషనల్ అవార్డును నిలిపివేస్తున్నట్లు అవార్డుల కమిటీ ప్రకటించింది. ఈ అవార్డు ఫంక్షన్ కోసం జానీ మాస్టర్ మధ్యంతర బెయిల్ కూడా పొందారు. తాజాగా మరోసారి తనకు బెయిల్ మంజూరు చేయాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించగా షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. జానీ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడంటూ ఆయన అసిస్టెంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2017లో జానీ మాస్టర్ పరిచయ మయ్యాడు. 2019లో అతని బృందంలో సహాయ నృత్య దర్శకురాలిగా చేరాను. ముంబయిలో ఓ సినిమా చిత్రీకరణ నిమిత్తం జానీ మాస్టర్‌తో పాటు నేను, మరో ఇద్దరు సహాయకులం వెళ్లాం. అక్కడ హోటల్‌లో నాపై జానీ మాస్టర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే పని నుంచి తొలగిస్తానని, సినిమా పరిశ్రమలో ఎప్పటికీ పని చేయలేవని బెదిరించాడు. దీన్ని అవకాశంగా తీసుకుని.. హైదరాబాద్ నుంచి ఇతర నగరాలకు సినిమా చిత్రీకరణకు తీసుకెళ్లిన సందర్భాల్లో పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. షూటింగ్ సమయంలోనూ వ్యానిటీ వ్యాన్‌లో అసభ్యంగా ప్రవర్తించేవాడు. వేధింపులు భరించలేక జానీ మాస్టర్ బృందం నుంచి బయటకొచ్చేశాను. అయినా సొంతంగా పని చేసుకోనివ్వకుండా, ఇతర ప్రాజెక్టులు రానీయకుండా ఇబ్బంది పెట్టాడని ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నారు.

## సరిహద్దు రాష్ట్రాల నుంచి మహారాష్ట్రకు డబ్బులు

### శివసేన నాయకుడి ఆరోపణలను ట్వీట్ చేసిన కెటిఆర్

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక సరిహద్దులను మూసేయాలని, భద్రతను కట్టుదిట్టం చేయాలని శివసేన నాయకుడు కిరణ్ పావస్కర్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. ఎందుకంటే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన్ర తెలంగాణ, కర్ణాటక నుంచి మహారాష్ట్రకు వందల కోట్ల నగదును తరలించే అవకాశం ఉందని కిరణ్ పేర్కొన్నారు. ఈ నగదును మహా వికాస్ అఘాడీకి ఖర్చు పెట్టే అవకాశం ఉందని తెలిపారు. కిరణ్ లేవనెత్తిన అంశం జాతీయ మీడియాలో ప్రచురితం అయింది. ఈ వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ అంశంపై కేటీఆర్ కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంగా మారిందని ధ్వజమెత్తారు.

# రాహుల్ ఆలోచనలకు భిన్నంగా రాష్ట్ర కాంగ్రెస్

### ఫిరాయింపులను ప్రోత్సహించడం ఆశ్చర్యం

### ఫిరాయించిన వారికే ప్రత్యేక గుర్తింపు

### పోచారం శ్రీనివాసరెడ్డికి సలహాదారు పదవా

### ఏఐసిసికి రాసిన లేఖలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆవేదన

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): కేసీఆర్‌లాగే కాంగ్రెస్.. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం పట్ల ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారని అంటూ ఎఐసిసికి రాసిన లేఖలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనలకు భిన్నంగా పార్టీ నడుస్తోందని తెలిపారు. పార్టీ ఫిరాయించిన వారికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వబడుతుందనే అభిప్రాయాన్ని కల్గించే విధంగా పార్టీ వ్యవహారం ఉన్నట్లు పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలతో పోచారం ఇంట్లో సమావేశం నిర్వహించడాన్ని ఎమ్మెల్సీ తీవ్రంగా తప్పుబట్టారు. ముఖ్య అనుచరుడి హత్యతో తీవ్ర మనోవేదనకు గురైనఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై కూడా అసహనాన్ని వ్యక్తం చేస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. తాజాగా పార్టీలో కొనసాగుతున్న పరిణామాలను జీర్ణించుకోలేక తీవ్ర మానసిక వ్యధతో ఏఐసీసీ చీఫ్‌కు జీవన్ రెడ్డి లేఖ రాశారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ గురించి లేఖలో సంచలన వ్యాఖ్యలు చేశారు. నేను నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ నన్ను అగౌరవంగా, అవమానంగా చూస్తోంది. నా భవిష్యత్తు కార్యాచరణ పార్టీనే మార్గదర్శకం చేయాలి. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి , పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లకు ఎమ్మెల్సీ లేఖ రాశారు. కాంగ్రెస్‌లో తనకు జరుగుతున్న అన్యాయం, పరిణామాలను వివరిస్తూ ఎమ్మెల్సీ లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే సంజయ్ అనుచరుడిగా భావించే సంతోష్ కాంగ్రెస్ పార్టీ నాయకుడిని హత్య చేశాడని వెల్లడించారు. పదేండ్లు అనేక దౌర్జన్యాలను ఎదుర్కున్నామని.. కాంగ్రెస్ ముసుగు కప్పుకొని మళ్ళీ దౌర్జన్యాలు చేస్తామంటే ఎలా భరించాలని అడిగారు. పార్టీని కన్నతల్లి అనుకున్నానని.. పార్టీ తనకు అనేక అవకాశాలు ఇచ్చిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్‌పై పోటీ చేయమంటే చేశానన్నారు. నన్ను ప్రతిపక్షాలు ఏకాకిని చేసి హేళన చేసినా తట్టుకొని నిలబడ్డాను. పార్టీ అధిష్ఠానం నా గౌరవాన్ని కాపాడతానని నోటిమాటగా చెప్పింది. పార్టీ ఫిరాయింపులకు ముఠా నాయకుడు ఉన్నాడు. పార్టీ ఫిరాయింపులకు ముఠా నాయకుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి. పది మంది ఎమ్మెల్యేలు లేకపోతే ప్రభుత్వం కొనసాగాదా.. రాహుల్ ఏం చెప్తున్నాడు. మనం ఏం చేస్తున్నాం. మా పార్టీ నాయకుడు గంగారెడ్డిని చంపిన వ్యక్తి బీఆర్ఎస్ తరపున ఎన్నికల్లో డబ్బులు పంచారు. గంగారెడ్డిని చంపిన సంతోష్‌పై అనేక క్రిమినల్ కేసులు ఉన్నాయి. గంగారెడ్డిని మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నేను ప్రపోజ్ చేశారు. ఎవరి అండదండలు చూసుకొని సంతోష్ మా నాయకుడిని చంపాడు అంటూ ఆయన ప్రశ్నలు కురిపించారు. అలాగే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై కూడా జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కాంగ్రెస్ పార్టీ పుట్టిందే మా ఇంట్లో అంటున్నాడు. మీ ఇంట్లో కాంగ్రెస్ పార్టీ పుడితే పరాయి ఇంటికి ఎందుకు వెళ్ళాడు. సంజయ్ ఎప్పుడైనా కాంగ్రెస్ పార్టీకి ఓటేశాడా.. నేను రాజీవ్ గాంధీ



నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరాను. సంజయ్ చొక్కారావు మనవడిని అని చెప్పుకుంటున్నారు. ఇందిరా గాంధీ కష్టకాలంలో ఉన్నప్పుడు చొక్కారావు జనతా పార్టీలో చేరాడు. సంజయ్ టీఆర్ఎస్‌లో ఎన్నడూ లేడు. అక్కడి ఉద్యమ నాయకుల మధ్య సమన్వయ లోపం వల్ల సంజయ్ తెరపైకి వచ్చాడు. అభివృద్ధి జరగాలంటే అధికార పార్టీలో చేరతామంటే ప్రజాస్వామ్యం ఉంటుందా. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కేసీఆర్ పరిస్థితి ఏమయిందని అంటూ వ్యాఖ్యలు చేశారు. అలాగే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పైనా ఎమ్మెల్సీ విరుచుకుపడ్డారు. భట్టికి ప్రతిపక్ష నేత హోదా పోవడానికి కారణం పోచారమన్నారు. పోచారం లాంటి వాడిని పార్టీలో చేర్చుకోవడం ఏంటి? పోచారం సలహాదారుడు ఏంటి. పార్టీ ఫిరాయింపుల క్రమబద్ధీకరణ విషయంలో పోచారం సలహాలు ఇవ్వగలడు అంటూ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు.నేను నిద్రలేని రాత్రులు గడుపుతున్నాను. పార్టీని వదిలి వెళ్ళాలనే ఆలోచన చేయలేకపోతున్న. అవమానాలు భరించుకుంటూ ఉండాలా? రేవంత్ మా నాయకుడు. ఆయన్ని తప్పకుండా కలుస్తాను. కాంగ్రెస్ కార్యకర్తల ఆవేదన మా వ్యక్తిగతం అని పీసీసీ చీఫ్ భావిస్తే నేనేం చేయగలను. పార్టీ పట్ల గౌరవం లేకనే నేను ఇక్కడి దాకా వచ్చానా.. ఇప్పటికీ నాకు పార్టీపై గౌరవం ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. రేవంత్ నాయకత్వంలో ప్రభుత్వం సమర్థవంతంగా పని చేస్తోంది. నేను రాజకీయం చేయడం లేదు. సంజయ్ భుజాలు తడుముకుంటున్నాడు. మా పార్టీ నాయకుడిని చంపిన నిందితుడు సంజయ్ అనుచరుడు కాదని చెప్పగలరా.. సంజయ్ ఏ పార్టీలో ఉన్నాడో ఆయనకి క్లారిటీ లేదా.. దానం నాగేందర్‌కు ఎంపీ టికెట్ ఇవ్వడాన్ని సమర్థించడం లేదు. నేను ఎప్పుడూ పార్టీ ఫిరాయించలేదు. నాకు నేనుగా మంత్రి పదవికి రాజీనామా చేశారు. పదేండ్లలో నేను పార్టీని నిలబెట్టాను. రాహుల్ ప్రధాని కావాల్సిందే. నామినేటెడ్ పదవులు మాకు ఇవ్వాలి. పార్టీలో మాదే ఆధిపత్యం ఉండాలి అంటే ఎలా. పార్టీ ఫిరాయించి ముసుగేసుకొని దౌర్జన్యం చేయడం బ్లాక్ మెయిల్ కాదా. నా మానసిక పరిస్థితి అర్థం చేసుకోండి. పార్టీ ఫిరాయింపులు జరిగాయో లేదో క్లారిటీ లేకుండా పోతుంది. నేను పార్టీకి అంతర్గతంగా లేఖ రాశాను. ఆవేదన భరించలేక బయటకి చెప్పుకుంటున్నానని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

# తెలంగాణలో మోసపోయామని చెప్పండి



### మహారాష్ట్రలో కాంగ్రెస్‌ను ఓడించమనండి

### హామీలు ఇచ్చి మోసం చేసారని తెలపండి

### ఆదిలాబాద్ సభలో కెటిఆర్ పిలుపు

ఆదిలాబాద్, (క్రైమ్ మిర్రర్): తెలంగాణలో మోసపోయామని, మహారాష్ట్రలో చెప్పి కాంగ్రెస్‌ను ఓడించాలని సరిహద్దు గ్రామాల ప్రజలకు కెటిఆర్ పిలుపునిచ్చారు. పొరుగున ఉన్న మహారాష్ట్రలో ఈ నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ లుచ్చగాళ్లకు ఓటేయొద్దని మహారాష్ట్రలో ఉన్న బంధువులకు, దోస్తులకు గట్టిగా చెప్పండి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. ఆదిలాబాద్ జిల్లాలోని రామ్‌లీలా మైదానంలో ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. నవంబర్‌లో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఆదిలాబాద్ వాళ్లకు అక్కడ చుట్టాలు, దోస్తులు ఉంటారు. కాంగ్రెస్ లుచ్చగాళ్ల సంగతి వారికి తెలియజెప్పండి.. మేం మోసం పోయాం.. మీరు మోసపోకండి అని చెప్పండి. రైతు భరోసా, తులం బంగారం, పెన్షన్లు, స్కూటీలు అని కథలు చెప్పి ఓట్లు వేయించుకుని మోసం చేశారు. ఈ కాంగ్రెస్ కు ఓట్లేస్తే మళ్లా మోసం జరుగుతదని గట్టిగా చెప్పాలని కేటీఆర్ సూచించారు. ఈ పోరాటం ఈ రోజుతో ఆగిపోయేది కాదు. ఈ ఆదిలాబాద్ ఆనాడు తెలంగాణ ఉద్యమంలో ముందుంది. బోరాజ్ చెక్ పోస్టు వద్ద వంటావార్పు చేస్తే నేనొచ్చాను. ఇవాళ ఆదిలాబాద్‌లో అగ్గి రాజుకుంది. ముఖ్రా కే గ్రామం వద్ద ఆగి సర్పంచ్ మీనాక్షిని పలుకరించాను. రైతులంతా కలిసి పోస్టు కార్డులు కొన్నారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా, పెన్షన్, తులం బంగారం, స్కూ.. ఎక్కడికి పోయినయ్.. ఎప్పుడు ఇస్తావని రాహుల్ గాంధీకి ఉత్తరం రాశారు. ఆనాడు ఉగ్గుపాలతోనే ఉద్యమాలు నేర్పిన గడ్డ ఆదిలాబాద్.. కుమ్రంభీం పుట్టిన ఈ గడ్డలో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పే రోజు వస్తదని కేటీఆర్ అన్నారు. రుయ్యాడ గ్రామంలో రైతుల మీద కేసులు పెట్టారని తెలిసింది. రుణమాఫీ మోసాన్ని నిరసిస్తూ దిష్టిబమ్మ కాలపెడితే కేసులు పెట్టారు. వాళ్లను జైల్లో పెడుతారట.. రైతులు బాధపడాల్సిన అవసరం లేదు. మీ కోసం మేం జైలుకు వెళ్తాం.. మీరు ఇదే విధంగా మాకు శక్తినివ్వండి.. కాంగ్రెస్ నాయకులతో మేం కొట్లాడుతాం.. కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమంలో కొట్లాడినట్టే రేపు కూడా పోరాడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## నల్ల వెంకటేశ్వర్లకు ఘోష్ కమిషన్ ప్రశ్నలు

### డిపిఆర్ మార్పుపై నిజాలు ఆరా

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): కాళేశ్వరం కమిషన్ విచారణకు విశ్రాంత ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఆయన్ను విచారణ కమిటీ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ విచారించారు. ఆనకట్టల నిర్మాణం, నాణ్యత, నిబంధనలు, నిర్వహణపై పలు ప్రశ్నలు వేశారు. గతంలోనూ నల్లా వెంకటేశ్వర్లును జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారించింది. ఆయన్ను గురువారం మరోసారి క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. నల్లా వెంకటేశ్వర్లుపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. నిజాలు, దస్త్రాల ఆధారంగానే సమాధానాలు చెప్పాలంది. కమిషన్ ముందు నిరాధారమైన వ్యాఖ్యలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. కాళేశ్వరం డీపీఆర్‌పై నిర్ణయం ఎప్పుడు, ఎవరు తీసుకున్నారని ఆయన్ను ప్రశ్నించారు. 2016లో అప్పటి సీఎం ఆదేశాలతో నిర్ణయం జరిగిందని వెంకటేశ్వర్లు బదులిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఆలోచన అప్పటి సీఎందేనని తెలిపారు. సమీక్షకు పిలిచేవరకు తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. సీడబ్ల్యూసీ ఆమోదం తర్వాతే డీపీఆర్ మార్పులు జరిగాయా అని కమిషన్ ప్రశ్నించింది. దానికి వెంకటేశ్వర్లు అవునని సమాధానమివ్వగా.. మార్పులు ఎవరు చేశారని జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. ఉన్నత స్థాయి కమిటీ ఆదేశాలతో మార్పులు జరిగినట్లు వెంకటేశ్వర్లు చెప్పారు. 3 ఆనకట్టల నిర్మాణ స్థలాన్ని వ్యాప్కోస్ సూచించిందన్నారు. ప్రభుత్వం, అధికారుల ప్రమేయం లేకుండానే వ్యాప్కోస్ ఎలా సూచిస్తుందని కమిషన్ ప్రశ్నించింది.

### తెలంగాణలో పెట్టుబడులకు

## జర్మనీ ఆసక్తి

### శ్రీధర్‌బాబుతో రైన్‌ల్యాండ ప్రతినిధి బృందం భేటీ



హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): తెలంగాణలో పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలకు జర్మనీలోని రైన్‌ల్యాండ్ రాష్ట్రం ఆసక్తి కనబర్చిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. రైన్‌ల్యాండ్‌కు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం సచివాలయంలో శ్రీధర్ బాబుతో భేటీ అయింది. రైన్‌ల్యాండ్ మంత్రి డానియెల్ బృందం, చెన్నైలోని జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేలా కలిసి పెట్టుబడులపై మంత్రితో చర్చించారు. ఫార్మా ఉత్పత్తులు, బయోటెక్నాలజీ, వ్యాక్సిన్‌లు, ప్యాకేజింగ్, పౌల్ట్రీ, వ్యవసాయం, ఆటోమొబైల్స్, లాజిస్టిక్స్ వంటి విభాగాల్లో భాగస్వాములు కావడం, పెట్టుబడులు పెట్టే అవకాశాలపై చర్చించారు. సులభతర వాణిజ్య విధానాలు, తక్షణ అనుమతుల జారీలో తెలంగాణ అగ్రగామిగా ఉందని ఈ సందర్భంగా జర్మనీ బృందానికి శ్రీధర్ బాబు తెలిపారు. నూతన ఆవిష్కరణలు, ఆధునిక పరిశోధనలను ప్రోత్సహించే విధంగా ప్రపంచ స్థాయి వ్యవస్థను ఏర్పాటు చేయడంపై దృష్టి సారించామన్నారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా పెట్టుబడులకు తెలంగాణ ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా నిలుస్తోందన్నారు. నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యతతో పాటు అత్యున్నత మౌలిక సదుపాయాలతో పరిశ్రమ దృష్టిని ఆకర్షిస్తోందని అన్నారు. హైదరాబాద్‌లో జరిగే బయో ఆసియా-2025 సదస్సుకు హాజరు కావాలని శ్రీధర్ బాబు.. ప్రతినిధుల బృందాన్ని కోరారు. రైన్‌ల్యాండ్, తెలంగాణ రాష్ట్రాలు ఇకపై పరస్పర సహకార సంబంధాలు కలిగి ఉండాలని ఇరు పక్షాలు అంగీకరించాయి. రైన్‌ల్యాండ్‌ను సందర్శించి అక్కడి అభివృద్ధిని పరిశీలించాలని మంత్రి డానియెల్ బృందం శ్రీధర్ బాబును ఆహ్వానించింది.

క్రైమ్ మిర్రర్

# ఎడిటోరియల్

4

శుక్రవారం

25-10-2024

## ఎడిటోరియల్



# కెనడా ప్రధాని ట్రూడోపై అసంతృప్తి జ్వాల

### వివాదమవుతున్న పలు నిర్ణయాలు

### సొంత పార్టీ ఎమ్మెల్యేలే నిరసన గళం

### వచ్చే ఎన్నికల్లో విజయం అనుమానమన్న సర్వే

**కె**నడా ప్రధాని జస్టిన్ ట్రూడోపై స్వపక్షంలోనే అసంతృప్తి భగ్గుమంది. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రకటనలు దేశంలో తీవ్ర అసంతృప్తిని కలుగ చేస్తున్నాయి. ముఖ్యంగా భారత్ వ్యతిరేక వైఖరి పట్ల తీవ్ర వ్యతిరేకత వస్తోంది. అందుకే ఆయన రాజీనామా చేయాలని 24 మంది లిబరల్ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం ఆ పార్టీ ఓ క్లోజ్డ్‌డోర్ సమావేశం నిర్వహించింది. ఈ ఏడాది జూన్, సెప్టెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో తీవ్రంగా దెబ్బతినడానికి ప్రధాని ట్రూడో వైఖరే కారణమని అందులో సభ్యులు అసంతృప్తి వ్యక్తంచేశారు. దీనిపై ట్రూడో సన్నిహితుడిగా పేరున్న ఇమిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ మాట్లాడుతూ ఇది చాలా రోజులుగా నలుగుతున్న విషయం. ప్రజలు దీనిని బయటపెట్టడం అవసరం. ఎన్నికల్లో ఏం జరిగింది అనే విషయాన్ని ఎంపీలు నిజాయతీగా ప్రధానికి వెల్లడించారు. ఆయనకు వినడం ఇష్టం ఉన్నా లేకపోయినా వారు మాత్రం చెప్పేశారని రిపోర్టర్ల వద్ద వ్యాఖ్యానించారు. ట్రూడో రాజీనామా చేయాలన్న లేఖపై మొత్తం 153 మంది ఎంపీల్లో 24 మంది సంతకాలు చేశారని కెనడా బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ వెల్లడించింది. అక్టోబర్ 28 వరకు డెడ్‌లైన్ విధించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే మైనార్టీలో ఉన్న ప్రభుత్వానికి ఇది మరింత సవాలుగా మారనుంది. జూన్, సెప్టెంబర్ ఎన్నికల్లో లిబరల్స్ బలమైన రెండు స్థానాలను కోల్పోయారు. అంతేకాదు.. పార్టీ వచ్చే ఎన్నికలకు చేసే సన్నాహాలు కూడా దారుణంగా ఉన్నాయని ఎంపీలు అభిప్రాయపడ్డారు. పార్టీ ఎంపీ ఎరిస్కిన్ స్మిత్ మాట్లాడుతూ పరిస్థితులను చక్కదిద్దడానికి ట్రూడోకు ఇంకా సమయం ఉందని వ్యాఖ్యానించారు. మా సహచరులు అసంతృప్తి వ్యక్తంచేసినప్పుడు దానిని వినడం చాలా ముఖ్యమన్నారు. ఈ సమావేశ సమయంలో ట్రూడో విలేకర్లతో మాట్లాడుతూ తాము బలంగా, సమష్టిగా ఉన్నామని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలకు తానే నాయకత్వం వహిస్తానని వెల్లడించారు. చాలాకాలం లిబరల్స్‌తో కలిసి ప్రభుత్వాన్ని నడిపిన ఎన్‌డీపీ కూడా ఈసారి బ్రిటిష్ కొలంబియా ఎన్నికల్లో తీవ్రంగా దెబ్బతింది. అక్కడ కన్జర్వేటివ్ పార్టీ ఎవరూ ఊహించని స్థాయిలో బలపడింది. ఇటీవల నానోస్ రీసెర్చ్ సర్వేలో అక్టోబర్ 15 నాటికి ప్రజల్లో 39శాతం మద్దతు కన్జర్వేటివ్‌లకు ఉండగా.. లిబరల్స్‌కు కేవలం 23శాతం మాత్రమే ఉన్నట్లు వెల్లడైంది. ఇక న్యూడెమోక్రాట్స్‌కు 21శాతం మంది సానుకూలంగా ఉన్నట్లు తేలింది. ఖలిస్థానీ మద్దతుదారులను లక్ష్యంగా చేసుకొని భారత ప్రభుత్వ ఏజెంట్లు పనిచేస్తున్నారని, వారికి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగులతో సంబంధాలున్నాయని కెనడా ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలకు సంబంధించి కేవలం తమవద్ద గతంలో నిఘా సమాచారం మాత్రమే ఉందని ప్రధాని జస్టిన్ ట్రూడో ఇటీవల అంగీకరించారు. ఈ ఆరోపణలతో ఇరుదేశాల మధ్య సంబంధాలు తీవ్రస్థాయిలో దెబ్బతిన్నాయి. ఇదిలావుంటే వలసల నియంత్రణకు కెనడా ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. తమ దేశంలోకి అనుమతించే వలసదారుల సంఖ్యను భారీగా తగ్గించేందుకు సిద్ధమైంది. మరోసారి అధికారంలోకి రావాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు అక్కడి వార్తాపత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. ఈ కథనాల ప్రకారం.. 2024లో 4,85,000 మందిని శాశ్వత నివాసితులుగా కెనడా గుర్తించింది. అయితే, 2025లో ఈ సంఖ్య 3,80,000లకు మాత్రమే పరిమితం చేసింది. 2027 నాటికి 3,65,000 మందికి మాత్రమే ప్రవేశం కల్పించాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. 'కెనడాలో తాత్కాలిక విదేశీ ఉద్యోగుల సంఖ్యను తగ్గిస్తున్నాం. కంపెనీలకు సంబంధించి కొన్ని కఠిన నిబంధనలు తీసుకురానున్నాం. నియామకాల విషయంలో కంపెనీలు స్థానికులకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వలేదో వెల్లడించాల్సి ఉంటుంది' అని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఏడాది కెనడాలో ఎన్నికలు జరగనున్నాయి. ఈక్రమంలో చేపట్టిన సర్వేల్లో ట్రూడో నేతృత్వంలోని లిబరల్ ప్రభుత్వం వెనకంజలో ఉంది. వలసల కారణంగా నిరుద్యోగం పెరిగి పోతుండటంతో పాటు, దేశీయంగా ఇళ్ల కొరత విపరీతంగా ఉంది. దీంతో అధికార ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. అందులోభాగంగా ఇటీవల విదేశీ విద్యార్థులకు స్టడీ పర్మిట్లు, వర్కర్లకు పని అనుమతులపై మరిన్ని ఆంక్షలు తీసుకురానున్నట్లు ప్రకటించింది. తాజాగా వలసదారుల సంఖ్యను తగ్గించేందుకు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

# కుటుంబం అంతా జగన్..మాయ!

**జగన్ అంతరంగం ఏమిటో బయటపడ్డది. చెల్లికి తల్లికి వాటా చెల్లించకుండా కేసులు వేసిన ఘనుడు ..ప్రజలకు మేలు చేస్తాడని, చేశాడని అనుకోవడం భ్రమే అవుతుంది. నీకింత..నాకింత అన్న చందంగా ఐదేళ్లు రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన జగన్ ఓ మంచి నేతగా మాత్రం నిరూపించుకోలేక పోయారు. అందివచ్చిన అవకాశాన్ని చేజార్చుకున్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశంతో ఎపిని దేశంలోనే అగ్రభాగానా నిలిపే అవకాశం వచ్చినా వదులుకున్నారు.**



ఐదేళ్లలో పోలవరం పూర్తి చేయలేదు. రాజధాని అన్నది లేకుండా చేశారు. అభివృద్ధి అన్నది లేకుండ ఆచేశారు. బటన్ నొక్కుడే అభివృద్ధి అని భ్రమింప చేశారు. విశాఖలో రాజసౌధాలు నిర్మించుకున్నారు. తానే మళ్లీ ముఖ్యమంత్రి అయి..అందులో విలాసాలు సాగించాలని అనుకున్నారు. ఇలా చెప్పకుంటూ పోతే అనేకం ఉన్నాయి. ప్రజలను ఓటింగ్ యంత్రాలుగా గుర్తించి వారికి తాయిలాలు పంచి, వారినుంచి ఓట్లు పొందాలని చూశారు. కానీ ప్రజలు జగన్ నైజాన్ని గమనించి గట్టిగా బుద్ధి చెప్పారు. ఇంతటి వికృత ప్రవర్తన కలిగిన వ్యక్తి.. దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరును భ్రష్టు పట్టించారు. తండ్రిలా జగన్ ఏనాడూ ప్రజల గురించి ఆలోచించలేదు. ప్రజలను దూరం పెట్టారు. ఇప్పుడు అధికారం పోగానే నా ప్రజలో అంటూ పాలోమని పోవడం..పరామర్శించడం మాత్రం నేర్చుకున్నారు. ఇలా నమ్మిన ప్రజలే జగన్‌ను గద్దె నెక్కించిన పాపానికి ఐదేళ్లపాటు అష్టకష్టాలు అనుభవించారు. రాజధాని లేకుండా పోయింది. అడుగు మేర రోడ్డు కూడా పడలేదు. లిక్కర్, ఇసుక, భూముల దోపిడీ జరిగింది. ఈ విషయంలో ఎంత చెప్పుకున్నా తక్కువే. ఇంతలా విపరీత ప్రవర్తన ఉన్న జగన్ తన చిన్నాన్న మర్డర్ కేసును తేల్చాలని ఏనాడూ భావించలేదు. ఇప్పుడు కుటుంబానికి న్యాయం చేయడానికి ముందుకు రావడం లేదు. అందుకే జగన్ చుట్టూ ఇలాంటి వారే చేరారు. మాట తప్పను.. మడమ తిప్పను అని పదేపదే చెప్పే వైకాపా అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన సొంత కుటుంబంలోని తల్లి, చెల్లి విషయంలోనే మాట తప్పి, మడమ తిప్పారు. ప్రేమతో చెల్లికి ఆస్తులు ఇస్తానని అవగాహన ఒప్పందం కుదుర్చుకుని మరీ ఇప్పుడు తూచ్ ఇవ్వనుపో అన్నారు. రాజకీయంగా విభేదించారన్న కారణంగా తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలపై ఏకంగా కోర్టుకెక్కారు. షర్మిల రాజకీయంగా, వ్యక్తిగతంగా ఆరోపణలు చేసి తన పరువు, ప్రతిష్ఠలను దెబ్బతీశారని, ఆమెకు తనపై ప్రేమ లేదని తేలిందని, అందువల్ల చెల్లికి ఇచ్చిన గిఫ్ట్‌డీడ్‌ను రద్దు చేసుకుంటున్నానని వెల్లడించారు. ఆమెను దూరం పెట్టిందే జగన్. ఆమెను రాజకీయంగా దూరం చేసి, ఏకాకిని చేసిన తరవాతనే షర్మిల తెలంగాణలో కాలు మోపారు. తల్లిని పార్టీ బాధ్యతల నుంచి దూరం చేశారు. ఇవన్నీ కూడా కావాలనే చేసిన జగన్ ఇప్పుడు ఆస్తుల విషయంలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తారని అనుకోవడం మనదే తప్పు. జగన్ ప్రజల ఆస్తులనే తనవిగా చేసుకున్న తీరును గత ఐదేళ్లలో చూశాం. ఎపిని 50 ఏళ్లపాటు వెనక్కి నెట్టారు. ఫ్యూడల్ మనస్తత్వంతో పాలన చేసే వారికి తరతమ భేదాలు ఉండవు. అందుకే ఇప్పుడు ఇంట్లోనూ వాటాలు, ఆస్తుల గొడవలు సృష్టించారు. ఇలాంటి వారు ఎంతకైనా తెగిస్తారని షర్మిల అంటూనే ఉన్నారు. ప్రేమానుబంధాలతో ఆస్తుల్లో వాటా ఇచ్చారన్న కృతజ్ఞత లేకుండా షర్మిల తనకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టిందని జగన్, భారతిలు పేర్కొన్నారు. అంతేగాకుండా అవాస్తవాలు, తప్పుడు ప్రకటనలు చేశారని పేర్కొన్నారు. ఈ చర్యలు తనను రాజకీయంగా వ్యతిరేకించడంతోపాటు వ్యక్తిగత ప్రతిష్ఠ దెబ్బతీశాయన్నారు. అంతేగాకుండా అన్నాచెల్లెళ్ల అనుబంధంపై ప్రభావం చూపి ప్రేమ, అనుబంధాలను తగ్గించేలా చేశాయన్నారు. రాజకీయ ప్రేరేపిత రాలైన చెల్లి వ్యక్తిగతంగాను బురద చల్లారని, దీంతో ఆవేదనకు గురైన తాను తమ మధ్య ఎలాంటి ప్రేమ

మిగలలేదని గుర్తించినట్లు తెలిపారు. అందుకే చెల్లికి ఇవ్వాలన్న వాటాలు ఇవ్వడానికి చేసిన అవగాహన ఒప్పందం, తల్లికి గిఫ్ట్‌డీడ్ అమలు చేయకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. షర్మిల దురుద్దేశపూరిత చర్యల ద్వారా వాటాల బదలాయింపు అక్రమంగా జరిగాయని పేర్కొన్నారు. నిజమే రేపు..ఓటర్లు కూడా తమకు ఓటేయలేదని వారికి ఎలాంటి ప్రయోజనాలు కల్పించబోనని కూడా జగన్ చెప్పే ఆస్కారం ఉంది. జగన్ ప్రవర్తనను గుర్తించి ఓటర్లు ఇప్పటి నుంచే జాగ్రత్తగా ఉండాలి. తన ప్రయోజనాలకు భిన్నంగా ఉండే ఎవరిని కూడా జగన్ క్షమించరు. వారు కుటుంబ సభ్యులైనా, రాజకీయ నేతలైనా, ప్రజలైనా జగన్‌కు ఒక్కటే. ఐదేళ్ల పాలనలో ఇదే అనుసరించారు. ఇప్పుడు కుటుంబంలో అనుసరిస్తున్నారు. చెల్లి షర్మిలకు ఆస్తి పంపకాల్లో భాగం ఇవ్వడానికి కుదిరిన ఒప్పందంలో భాగంగా ట్రస్టీగా తల్లి విజయమ్మ పేరుతో గిఫ్ట్‌డీడ్ చేసిన జగన్ ఇప్పుడు దాన్ని రద్దు చేసుకుంటానంటున్నారు. గిఫ్ట్‌డీడ్‌లో పేర్కొన్న ఆస్తులను ఆటంకాలు లేకుండా అనుభవించవచ్చని, ఇందులో దాతతోపాటు ఎవరూ జోక్యం చేసుకోరనేది ఒప్పందంలో కీలకాంశం. అయితే తనతో సహా ఎవరూ ఆస్తి పంపకాల్లో జోక్యం చేసుకోరని హామీ ఇచ్చాక దానికి విరుద్ధంగా రద్దు చేసుకోవడం చెల్లదని న్యాయనిపుణులు చెబుతున్నారు. తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సంపాదించిన ఆస్తుల్లో తనకు, తన పిల్లలకు దక్కాల్సిన వాటా ఇవ్వకుండా.. సోదరుడు జగన్ అన్యాయం చేశారని మరోవైపు వైఎస్ షర్మిల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అరకొర ఆస్తులిచ్చి వెళ్లగొట్టాలని చూడటమే కాకుండా, ఆస్తుల పంపకానికి సంబంధించి తనతో చేసుకున్న ఒప్పందాన్ని కూడా తుంగలో తొక్కారని మండిపడ్డారు. తల్లిపైనా, చెల్లిపైనా కేసు పెట్టి, కుటుంబాన్ని కోర్టుకీడ్చేంత నీచానికి ఒడిగట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తుల విషయం సెటిల్ చేసుకోవాలంటే.. జగన్‌కు, అవినాష్‌రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడకూడదని తనకు షరతు పెట్టడంపై ఆమె తీవ్రంగా మండిపడ్డారు. మొత్తంగా జగన్ ఆస్తుల గొడవ కారణంగా ఆయన మనస్తత్వం ప్రజలకు అర్థం అయివుండాలి. ఐదేళ్లుగా అనుభవంలోకి వచ్చి ఉండాలి. అందువల్ల ఎపి ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే. జగన్ లాంటి నేతలు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. రాజకీయాల్లో త్యాగాలు చేయని వారిని కూడా ప్రజలు ఆదరించరాదు.



## పార్లమెంటరీ కమిటీ ముందు సెబీ చీఫ్ గైర్హాజరు

### సమావేశాన్ని వాయిదే వేసిన కమిటీ

పార్లమెంటరీ కమిటీ సమావేశానికి సెబీ చీఫ్ మాధబి పురీ బచ్ గైర్హాజరయ్యారు. దేశంలోని నియంత్రణ సంస్థల పనితీరును సమీక్షించేందుకు సెబీ చీఫ్‌కు పార్లమెంటరీ కమిటీ సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో గురువారం ఆమె కమిటీ ముందు హాజరుకావాల్సి ఉంది. అయితే కొన్ని ముఖ్యమైన కారణాలరీత్యా తాను హాజరుకాలేనని కమిటీకి తెలియజేశారు. దీంతో రివ్యూ కమిటీ సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలుస్తోంది. సెబీ చీఫ్ గైర్హాజరుపై ప్యానెల్‌కు నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ స్పందించారు. మొదటి కమిటీ సమావేశంలో రెగ్యులేటరీ పనితీరుపై సమీక్షించాలని భావించాం. మీటింగ్ కోసం సంబంధిత వ్యక్తులకు నోటీసులు పంపాం. వారు సమావేశం నుంచి మినహాయింపు కోరారు. కానీ మేం దాన్ని తిరస్కరించాం. ఆ తర్వాత తాను, తన బృందంతో కలిసి మీటింగ్‌కు హాజరవుతామని తెలిపారు. అయితే కొన్ని ముఖ్యమైన కారణాల వల్ల ఆమె దిల్లీకి వచ్చే పరిస్థితి లేదని ఉదయం 9:30గంటలకు మాకు సమాచారం అందింది. ఆమె అభ్యర్థనను పరిగణలోకి తీసుకొని సమావేశాన్ని వాయిదా వేశాం'అని తెలిపారు. బచ్‌కు పీఏసీ కమిటీ సమన్లు పంపడం ఇది రెండో సారి.

## కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో నిర్మాణాలు

### నెహారెడ్డి తదితరులపై చర్యలు తీసుకున్నారో చెప్పండి

### విశాఖ గ్రేటర్ మున్సిపల్ అధికారులకు హైకోర్టు ప్రశ్న

**వి**శాఖ జిల్లా భీమిలిపట్నం పరిధిలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టిన వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి కుమార్తె నెహారెడ్డి ఇతర బాధ్యులపై ఏం చర్యలు తీసుకున్నారని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఏపీ హైకోర్టు ప్రశ్నించింది. ఇక ఈ వ్యవహారంపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారా.. అని ఆరా తీసింది. వివరాలతో నివేదిక సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. భీమిలి బీచ్ వద్ద సీఆర్‌జడ్ ప్రాంతంలో సముద్రానికి అతి సమీపంలో హెచ్చరించింది. ఈ క్రమంలో అక్రమ నిర్మాణాలు కూల్చివేసేందుకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. విశాఖ జిల్లా భీమిలి బీచ్ వద్ద సముద్రానికి అతి సమీపంలో సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘించి నేహారెడ్డి కాంక్రీట్ గోడను నిర్మించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ అధికారులకు ఇప్పటికే హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. భీమిలి బీచ్ సమీపంలో శాశ్వత నిర్మాణాలపై జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ పిల్ వేశారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి




శాశ్వత కాంక్రిట్ నిర్మాణం చేపడుతున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ ప్రజాప్రయోజన వాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై గురువారం విచారణ జరిపిన ధర్మాసనం సముద్రానికి అతి సమీపంలో చేపట్టిన శాశ్వత నిర్మాణాలను తొలగించాలని జీవీఎంసీని ఆదేశించింది. ఈ వ్యాజ్యం నిన్న మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపించారు. కాగా వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కూతురు నేహారెడ్డి భీమిలి బీచ్ వద్ద సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టారు. నేహా రెడ్డి సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ హైకోర్టులో పిల్ కూడా దాఖలు చేశారు. బీచ్‌లో కాంక్రీట్ నిర్మాణాలను అనుమతించవద్దని అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. నేహా రెడ్డికి సెప్టెంబర్ 2న జీవీఎంసీ నోటీసులు జారీ చేసింది. 24 గంటల్లో ఆక్రమణలు తొలగించాలని.. లేదంటే తామే తొలగిస్తామని రవిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. కూల్చివేత విషయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో వివరిస్తూ స్థాయి నివేదికను సమర్పించాలని గత నెలలో హైకోర్టు నిర్దేశిరచి ఆపై తదుపరి విచారణను సెప్టెంబరు 11వ తేదీకి వాయిదా వేసింది. భీమిలి బీచ్ సమీపంలో శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ తరఫున న్యాయవాది పొన్నాడ శ్రీవ్యాస్ వాదనలు వినిపించారు.

# ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కండి



## సిపిఐ కంట్రోల్ కమిషన్ మెంబర్ పుస్తకాల నర్సింగరావు

గండిపేట్(క్రైం మిర్రర్): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సిపిఐ- కంట్రోల్ కమిషన్ మెంబర్ పుస్తకాల నర్సింగ్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి స్వామి అధ్యక్షతన నిర్వహించిన సిపిఐ గండిపేట మండల కౌన్సిల్ సమావేశం నార్సింగి లో ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా వచ్చేసి మాట్లాడారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్న ప్రజలకు ఇచ్చిన హామీలు ఇండ్లు, ఇళ్ల స్థలాలు, రైతు భరోసా, నిరుద్యోగ పింఛన్, మహాలక్ష్మి లాంటి పథకాలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. మూసి వెంట ఉన్న ప్రజలకు పునరావస సౌకర్యాలను కల్పించిన తర్వాతనే కాళీ చేయించాలని, బలవంతంగా ఖాళీ చేస్తే ప్రజల తరఫున పోరాటాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నవంబర్ నెలల్లో ప్రజా సమస్యలపై అవగాహన మీటింగులు పెట్టి ఎమ్మార్వో, కలెక్టర్ ఆఫీస్ లను ముట్టడిస్తామని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ ప్రభుత్వం కనీస వేతనల వెంటనే అమలులోకి తీసుకురావాలని, నిర్మాణరంగ కార్మికుల హక్కులను యాజమాన్యాల కాల రాస్తున్నాయని అన్నారు. రాబోయే కాలంలో అన్ని తరగతుల కార్మికుల సమస్యలపై సర్వే చేయడంతో పాటు పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బండి నరసింహ (దళిత హక్కుల సంఘం నియోజకవర్గ నాయకుని ) పార్టీలో చేర్చుకున్నారు. నాయకులు రాఘవేందర్ గౌడ్, బిక్షపతి, కృష్ణ, ప్రభాకర్, మహాదేవ్ తదితరులు పాల్గొన్నారు.



## రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన రివ్యూ మీటింగ్ పాల్గొన్న శానిటేషన్ అడిషనల్ కమీషనర్ రఘుప్రసాద్

గండిపేట్(క్రైం మిర్రర్): బస్తీలు, కాలనీల్లో చెత్తచెదారాలు పేరుకుపోకుండా అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని శానిటేషన్ అడిషనల్ కమీషనర్ రఘుప్రసాద్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో రివ్యూ మీటింగ్‌ను నిర్వహించారు. ప్రతి ఇంట్లోని చెత్తను ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 100 శాతం చెత్తను ఇంటింటికి వెళ్లి సేకరించాలన్నారు. ఓపెన్ పాయింట్లను పూర్తిగా ఎలిమినేట్ చేయాలని సూచించారు. ఎక్కడ కూడా మట్టి, చెత్త, వ్యర్థాలు పేరుకుపోకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలను సమీకృతం చేసుకోవాలన్నారు. ప్రజలు సైతం బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఉపకమీషనర్ రవికుమార్, ఏఎంవోహెచ్, ఎస్ఎఫ్‌లు, ఎస్ఎస్‌లు, రామ్‌కీ సిబ్బంది, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పార్ట్ 2 టెక్స్‌ట్ బుక్స్ అందజేసిన ఎంఈవో విజయ్‌కుమార్



గండిపేట్(క్రైం మిర్రర్): ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులే ఎక్కువగా చదువుకుంటారని వారికి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని గండిపేట మండల విద్యాధికారి విజయ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన పార్ట్ టూ ఆప్షనల్ పుస్తకాలను గురువారం ఆయన చేతుల మీదుగా గండిపేట ప్రధానోపాధ్యాయులకు ఇవ్వడం జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యాబుద్ధులు నేర్పిస్తారన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నతంగా చదివేలా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడి

గండిపేట్(క్రైం మిర్రర్): అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తు సకాలంలో పూర్తి చేయాలని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి సూచించారు. 15వ వార్డులోని సుహా అపార్ట్‌మెంట్ నుంచి ఐబాకో ఐస్‌క్రీం షాపు వరకు నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన ముఖ్య అత్యిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే గోతులమయంగా మారిన రోడ్లను తొలగించి నూతన రోడ్లను వేస్తున్నామన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఏర్పడితన తన దృష్టికి తేవాలని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, శ్రీరాములు, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## అత్తాపూర్ లో బాలుడి కిడ్నాప్కు విఫలయత్నం



గండిపేట్(క్రైం మిర్రర్):రాజేంద్రనగర్ నియోజకవర్గం హైదరూడలో ఓ బాలుడిని కిడ్నాప్ చేసేందుకు విఫలయత్నం చేశారు. బాలుడి అరుపులు విన్న స్థానికులు నింతుడిని పట్టుకోని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాల ప్రకారం కార్వాన్ ప్రాంతానికి చెందిన ఎల్లయ్య(25) గతంలో పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో నిందితుడిగా ఉన్నాడు. హైదరూడ ప్రాంతానికి చెందిన మనోజ్ కుమారుడు స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నాడు. గురువారం సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి సైకిల్పై వెళ్తున్న సమయంలో జనప్రియ వద్దకు రాగానే నిందితుడు ఎల్లయ్య బాలుడిని భయభ్రాంతులకు గురి చేసి సైకిల్పై బలవంతంగా తీసుకువెళ్లేందుకు ప్రయత్నించాడు. ఈ సమయంలో బాలుడు అరుపులు వేయడంతో అక్కడే ఉన్న స్థానికులు గమనించారు. అక్కడకు చేరుకోని ఎల్లయ్యను ప్రశ్నించారు. పొంతన లేని సమాధానాలు చెబుతుండడంతో బాలుడి కిడ్నాప్ విషయాన్ని బయటపెట్టాడు. దీంతో స్థానికులు ఎల్లయ్యను స్తంబానికి కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఫ్రిజ్ పేలి పూరి గుడిసె దగ్ధం



మునుగోడు క్రైమ్ మిర్రర్: ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూరీ గుడిసె దగ్ధం అయ్యిన ఘటన మునుగోడు లో చోటుచేసుకుంది..మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని జంగాల కాలనిలో నివాసం వుంటున్న దుగ్గి శేఖర్ తండ్రి రాములు నివాసం వుంటున్న పూరీ గుడిసె గురువారం రోజు ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో ఫ్రిజ్ పేలి పూర్తిగా దగ్ధం అయ్యిపోయింది..ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిపోయింది..ఇంట్లో వున్న బీర్వా,మంచం, కూలర్, వంట సామాను,బియ్యం,బట్టలు పూర్తిగా కాలిపొయ్యావి..సుమారు 3 లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. దుగ్గీ శేఖర్ కు భార్య ఒక కూతురు,ఇద్దరు కుమారులు గలరు..ఇతను వృత్తి రీత్యా పాత ఇనుప సామాను కొనుగోలు చేసి జీవనం కొనసాగిస్తుంటారు.ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న మాజి వార్డు సభ్యులు ఈద రాములు పరిశీలించారు .కుటుంబసభ్యులు మాట్లాడుతూ..ప్రమాదంలో పూర్తిగా నష్టం జరిగిందనీ, ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని,కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు..







## నాంపల్లి మండలంలో ముమ్మరంగా నల్గొండ ఖమ్మం వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

క్రైమ్ మిర్రర్, నాంపల్లి: టీ ఎస్ యు టి ఎఫ్ నాంపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నాంపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ , కె జి బి వి, గవర్నమెంట్ జూనియర్ కళాశాల లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గేర నరసింహ మాట్లాడుతూ గత ఐదున్నర సంవత్సరాలుగా ఎమ్మెల్సీ గా విశిష్ట సేవలు అందించిన అలుగుబెల్లి నర్సిరెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీ ఎస్ యు టి ఎఫ్ నాంపల్లి మండల శాఖ అధ్యక్షులు సిలువేరు నారాయణ, టీ ఎస్ యు టి ఎఫ్ నాంపల్లి మండల బాధ్యులు జింకల సత్యనారాయణ, సీనియర్ నాయకులు పల్లేటి వెంకటయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి...!!

తాండూర్ డీఎస్పీ బాలకృష్ణారెడ్డి...!!



క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి: గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తాండూర్ డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల పోలీస్ స్టేషన్ ను తాండూర్ డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను, స్టేషన్ పనితీరును పరిశీలించారు.ముఖ్యంగా సైబర్ క్రైమ్, సీసీ కెమెరాల పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్సై గిరి కి సూచించారు. ప్రతి గ్రామంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు.

## మధుబన్ కాలనీలో పుట్‌పాత్ అక్రమణల తొలగింపు



గండిపేట్(క్రైం మిర్రర్): పుట్‌పాత్‌లను అక్రమించి వాణిజ్య సముదాయాలను ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలకు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమీషనర్ రవికుమార్ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మధుబన్ కాలనీలో రోడ్డుకు ఇరువైపులా పుట్‌పాత్‌లను ఆక్రమించి వాణిజ్య సముదాయాలను ఏర్పాటు చేయడంతో వాటిని గురువారం జేసీబీ సహాయంతో కూల్చివేశారు. ఉపకమీషనర్ రవికుమార్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారులు ఈ కూల్చివేతలను చేపట్టారు. పోలీసుల భారీ బందోబస్తు నడుమ వీటిని తొలగించారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే మరింత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కూల్చివేతల సందర్భంగా స్థానికులకు, అధికారులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.

# జిల్లా వైద్య విభాగం ప్రక్షాళన కు డి ఎం హెచ్ ఓ చర్యలు

## రంగారెడ్డి డెమో అధికారిని కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కు సరెండర్

## ఆసుపత్రులకు నోటీసుల జారీ... అభాసు పాలైన రంగారెడ్డి డెమో

## ఆల్ఫా ఆసుపత్రి అనుమతుల జారీ వ్యవహారమే ఆయన మెడకు చుట్టుకుందా?

## పోస్టింగు కోసం కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో ఎదురుచూపులు

## రంగారెడ్డి జిల్లా డిఎంహెచ్ఓ నిర్ణయం పై కోర్టును ఆశ్రయించిన డెమో తిరుపతి రావు

**క్రైమ్ మిర్రర్ దిన పత్రిక ఎఫెక్ట్**

**( క్రైమ్ మిర్రర్ ప్రధాన ప్రతినిధి) :** రంగారెడ్డి జిల్లా వైద్య విభాగం లో ప్రక్షాళన షురూ అయింది. క్రైమ్ మిర్రర్ దినపత్రికలో వచ్చిన కథనాలతో స్పందించిన డి ఎం హెచ్ ఓ దిద్దుబాటు చర్యలను చేపట్టారు. రంగారెడ్డి జిల్లా వైద్య విభాగంలో డెమోగా విధులు నిర్వహిస్తున్న తిరుపతి రావు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ డిఎంహెచ్ఓ నిర్ణయం తీసుకున్నారు. డీఎంహెచ్ఓ నిర్ణయాన్ని డెమో గా వ్యవహరించిన తిరుపతి రావు కోర్టులో సవాలు చేసినట్లు తెలుస్తోంది. రంగారెడ్డి జిల్లా డెమోగా విధులు నిర్వహించిన సమయంలో తిరుపతి రావు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై డీఎంహెచ్వో కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయానికి సరెండర్ చేశారు. డిఎంహెచ్ఓ పేరిట ఆయనే స్వయంగా ఆసుపత్రులకు నోటీసులు జారీ చేశారన్న ఆరోపణలు గతంలో వినిపించాయి . ఈ సంఘటనపై " విధుల దుర్వినియోగంలో ఆయనకు ఆయనే సాటి " అన్న శీర్షికతో పాటు, " ఎవరిది ఈ సంతకం " అనే శీర్షికతో క్రైమ్ మిర్రర్ ప్రచురించిన కథనంపై డీఎంహెచ్వో తీవ్రంగా స్పందిస్తూ, సమగ్ర విచారణకు ఆదేశించారు. సంబంధిత అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా డెమో తిరుపతి రావు ను సరెండర్ చేసినట్లుగా తెలిపారు .

**ఆల్ఫా ఆసుపత్రికి ఇచ్చిన తాత్కాలిక పర్మిషన్ ఆయన కొంప ముంచిందా?**

ఆల్ఫా ఆసుపత్రికి ఇచ్చిన తాత్కాలిక అనుమతులే తిరుపతి రావు సరెండర్ కు దారితీశాయా? అన్న వాదనలు లేకపోలేదు. ఆల్ఫా ఆసుపత్రికి నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చారని అప్పట్లో పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపించాయి. ఈ ఆసుపత్రికి అనుమతుల జారీ వ్యవహారం చిలికి చిలికి గాలి వానగా మారి , డెమో తిరుపతి రావు మెడకు చుట్టుకుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

**ఫైర్ ఎన్ ఓ సి ఎలా ఇచ్చారన్న ప్రశ్నకు సమాధానమే లేదు**

ఆల్ఫా ఆసుపత్రికి ఫైర్ ఎన్ ఓ సి ఎలా ఇచ్చారన్న ప్రశ్నకు సమాధానం లేకుండా పోయింది. సెల్లార్ తో సహా 4 అంతస్థుల భవంతిలో ఆసుపత్రి నిర్వహించాలంటే కనీసం భవనం చుట్టూ ఫైర్ ఇంజన్ తిరిగే స్థలం ఉండాలి. రేపు అనుకోని సంఘటన జరిగి అగ్ని ప్రమాదం ఏర్పడితే, భవనంలో చిక్కుకున్న వారిని కాపాడే విధంగా అగ్నిమాపక యంత్ర వాహనం రాకపోకలు సాగించే విధంగా భవనం చుట్టూ ఓపెన్ స్పేస్ ఉండాల్సి ఉండగా, ఆల్ఫా ఆసుపత్రి ని ఏర్పాటు చేయాలని భావిస్తున్న బిల్డింగ్ చుట్టూ అటువంటి సౌకర్యాలు ఏవి లేకపోవడం ఆశ్చర్యకరమని పలువురు అంటున్నారు . ఇకపోతే ఈ బిల్డింగ్ కు మునిసిపల్ అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారన్నది ప్రశ్నార్థకంగా మారింది. కేవలం 300 గజాలకు నిర్మించిన భవనానికి సెల్లార్ తో సహా నాలుగు అంతస్తుల నిర్మాణం కోసం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగము నుంచి అనుమతులు ఎలా జారీ అయ్యా యో, అధికారులే సమాధానం చెప్పాలి.



# వర్సిటీలో నెలకొన్న ప్రతి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తా-ఉపకులపతి డాక్టర్ అల్దాస్ జంగయ్య

### వర్సిటీ నూతన ఉపకులపతి డాక్టర్ అల్దాస్ జంగయ్యకు ఘన స్వాగతం

గండిపేట్(క్రైం మిర్రర్): వర్సిటీలో నెలకొన్న ప్రతి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ అల్దాస్ జంగయ్య అన్నారు. నూతనంగా నియమితులైన ఆయనకు గురువారం వర్సిటీలో ఘన స్వాగతం పలికారు. రెండేళ్లుగా ఈ యూనివర్సిటీ లో రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ లేనందున యూనివర్సిటీ లో అనేక సమస్యలు నెలకొన్నాయి తద్వారా యూనివర్సిటీ లో రీసెర్చ్ పరంగా కూడా నాణ్యత తగ్గి యూనివర్సిటీ ర్యాంకింగ్ పడిపోవడం జరిగిందన్నారు. ఇటువంటి తరుణం లో ఈ యూనివర్సిటీ వ్యవస్థను దృష్టిలో పెట్టుకొని నూతన వైస్ ఛాన్సలర్ ను నియమించినందుకు స్టూడెంట్స్ , భోధన, బోధనేతర సిబ్బంది అందరూ ఘన స్వాగతం పలుకుతూ యూనివర్సిటీ లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగిందన్నారు. సామాజిక , ఆర్థిక సాంకేతిక నైపుణ్యం కలిగిన వైస్ ఛాన్సలర్ రావడంతో అందరూ హర్షం వ్యక్తం చేసారు. ఈ తరుణం లో స్టూడెంట్ జేఏసీ ప్రెసిడెంట్ రాజ్ కుమార్ , ఏఐఏఎస్ఏ ప్రెసిడెంట్ మధుకర్ పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, ఎన్ఎస్‌యూఐ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ నుంచి యూనివర్సిటీ ఆడిటోరియం వరకు బైక్ ర్యాలితో, టపసులతో , బ్యాండ్ సప్పుల్లతో ఘనమైన స్వాగతం పలుకుతూ యూనివర్సిటీ ఆడిటోరియం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శంకర్ , బాలకోటి, రాకేష్ , మిలింద్, భను చందర్, శేఖర్ , కవిరాజు, వినయ్ , బాబిత్ రాజ్ గౌడ్ , సాయి కాంత్ ధామ, పిహెడ్ స్కాలర్స్ కూడా పాల్గొన్నారు.

# మహేశ్వరం యోజకవర్గంలో అభివృద్ధి పనులను అడ్డుకోవద్దు : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

### రావిర్యాల చెరువు కట్టపై అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్ ):** గత ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో మంజూరైన నిధులతో మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల పెద్ద చెరువు కట్ట పైన జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ మంత్రి,మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి పి.సబితా ఇంద్రారెడ్డి ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలోని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మంజూరు చేసినటువంటి నిధుల్లో భాగంగా చెరువుల సుందరీ కరణ కొరకు నిధులు మంజూరు చేయడం జరిగిందని అట్టి నిధులను అడ్డుకోవడం వల్ల నేడు అన్ని పనులు కూడా అసంపూర్తిగా మిగిలిపోయాయని అంతేకాకుండా నియోజకవర్గ అభివృద్ధి కోసం మంజూరైన నిధులు కూడా అడ్డుకోవడం వల్ల నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోని మౌలిక సదుపాయాలను దృష్టిలో పెట్టుకొని ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు నిధులు మంజూరు చేస్తే ఈనాడు ముఖ్య మంత్రి మంజూరైన నిధులన్ని కూడా అడ్డుకోవడం జరిగిందని దయచేసి గత ప్రభుత్వం ఆనాడు కేటాయించిన నిధులు తక్షణమే మంజూరు చేయాలని, అభివృద్ధిని అడ్డుకోవద్దని కాంగ్రెస్ ప్రభుత్వానికి సరికాదని, రేవంత్ సర్కార్ని హెచ్చరించారు,ఈ కార్యక్రమంలో నాయకులు ప్రజాప్రతినిధులు మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.



# మూసీ బాధితులకు బీజేపీ అండగా ఉంటుంది

## మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్

### అత్తాపూర్ మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలతో సమావేశమైన బీజేపీ శ్రేణులు





గండిపేట్(క్రైం మిర్రర్): మూసీ సుందరీకరణ పేరుతో పేద ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని తిప్పికొట్టేందుకు భారతీయ జనతా పార్టీ ముందుండి పోరాడుతుందని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు. అత్తాపూర్ డివిజన్‌లోని టికేఆర్‌నగర్, భరత్‌నగర్‌లో హైడ్రా బాధితులను గురువారం అదిలాబాద్ ఎమ్మెల్యే పాయాల శంకర్ రాజేంద్రనగర్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి తో కలిసి బాధలను అడిగి తెలుసుకున్నారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు భారతీయ జనతా పార్టీ అండగా నిలుస్తుందన్నారు. ఎవరు అధైర్యపడవద్దని ఎంతటి పోరాడాలకైనా కలిసికట్టుగా ఉద్యమాలు చేద్దామన్నారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల ముందు అమలు కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ఇప్పుడు మూసీ సుందరీకరణ పేరుతో ప్రజలకు ఇబ్బందులపాలు చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఎదో మేలు చేస్తావ్ అని నీకు అధికారం ఇస్తే మా పేద ప్రజల ఇళ్లు ఎలా కూలుస్తారని ప్రశ్నించారు. పేద ప్రజల జోలికి వస్తే పాతాళానికి తొక్కేస్తామని హెచ్చరించారు. హైడ్రా పేరుతో హైదరాబాద్ శివారులో ఉన్న మురికి నీరు అంతా వచ్చి మూసీలో కలుస్తున్నప్పటికి దానికి పైపులైన్ ద్వారా ఎస్‌టిపిలు నిర్మించి ఫిల్టర్ చేసి మూసీలోకి వదిలిపెట్టాలన్నారు. కానీ ఈ ప్రక్రియ ఎక్కడ కూడా మొదలు పెట్టకుండా కట్టుకున్న ఇళ్లను కూలుస్తామంటూ ఇబ్బందులపాలు చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తుందన్నారు. ప్రజలకు అన్యాయం చేస్తామంటే తాము ఊరుకోమన్నారు. తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజల వెంట ఉండి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం కంటెస్టెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోంద్ర సంగీతగౌరీశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, కొమురయ్య, మల్లారెడ్డి, మహాలింగం గౌడ్,మల్లేష్‌యాదవ్, భీమ అర్జున్ రెడ్డి,మహేష్‌యాదవ్, వేణు రెడ్డి,రవి, రఘు తదితరులు పాల్గొన్నారు.

# నాటి ఊట బావులు... నేటి డంపింగ్ కేంద్రాలా?

**బావులలో చెత్తను వేయడం పై అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్న రైతులు**

**చెత్త డంపింగ్ కేంద్రాన్ని నిరుపయోగంగా పెట్టి... బావులలో చెత్త వేస్తారా?**

**చెత్త డంపింగ్ కేంద్రాన్ని ఎందుకు నిర్మించినట్లు... గ్రామ కార్యదర్శి చెప్పాలి**






**( భువనగిరి యాదాద్రి - క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ):** చెత్త డంపింగ్ కేంద్రాన్ని నిరుపయోగంగా పెట్టి, ఊట బావులను డంపింగ్ కేంద్రాలుగా మారుస్తున్న వైనం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్తాన్ నారాయణపురం మండల పరిధిలోని గుడిమల్కాపురం గ్రామంలో చోటు చేసుకుంది. ఊట బావులలో చెత్త వేయడాన్ని స్థానిక రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామంలోని చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్ లో తడి, పొడి చెత్తగా వేరు చేయాల్సిన సిబ్బంది బద్దకించి, చెత్తనంతా గ్రామంలోని ఊట బావులలో వేస్తూ చేతులను దులుపుకుంటున్నారు. గ్రామంలో చెత్త డంపింగ్ కేంద్రాన్ని నిరుపయోగంగా పెట్టి, ఊట బావులలో చెత్త వేస్తున్న వైనాన్ని గ్రామ కార్యదర్శి ఎలా సమర్థించుకుంటారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.. గ్రామంలో సేకరించిన చెత్తని పచ్చని పొలాల మధ్యలో ఉన్న బావుల్లో పడవేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు . ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. చెత్తను బావులలో వేయడం వల్ల ఊర్లోని వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ..స్థానికంగా ఉన్న రైతుల పశువుల పై దాడి చేస్తున్నాయన్నారు. గ్రామం నుంచి సేకరించిన చెత్తను బావులలో వేసి అక్కడే నిప్పు పెట్టడం వల్ల వాటి నుంచి వెలువడే వాయు కాలుష్యం వల్ల స్థానిక రైతులకు శ్వాస సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. గ్రామ డంపింగ్ యార్డ్ ను నిరుపయోగంగా పెట్టి, బావులలో చెత్త వేస్తున్న గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిపై, సిబ్బందిని పర్యవేక్షించడంలో విఫలమైన గ్రామ కార్యదర్శి పై మండల పంచాయతీ అధికారి తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గుడిమల్కాపురం గ్రామస్తులు కోరుతున్నారు.




# టీవీఎస్ మోటార్ కొత్త రికార్డ్

న్యూఢిల్లీ: ద్విచక్ర, త్రిచక్ర వాహన రంగ దిగ్గజం టీవీఎస్ మోటార్ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 41 శాతం జంప్‌చేసి రూ. 588 కోట్లను అధిగమించింది. రికార్డ్ అమ్మకాలు ఇందుకు సహకరించాయి.గతేడాది(2023-%24) ఇదే కాలంలో రూ. 416 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,933 కోట్ల నుంచి రూ. 11,302 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు రూ. 9,297 కోట్ల నుంచి రూ. 10,428 కోట్లకు పెరిగాయి. ఈ కాలంలో ఎగుమతులతోపాటు ద్విచక్ర, త్రిచక్ర వాహన అమ్మకాలు కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 12.28 లక్షల యూనిట్లను తాకాయి. గత క్యూ2లో నమోదైన 10.74 లక్షల యూనిట్లతో పోలిస్తే ఇది 14 శాతం వృద్ధి. వీటిలో మోటార్ సైకిళ్ల విక్రయాలు 14 శాతం పుంజుకుని 5.6 లక్షల యూనిట్లకు చేరగా.. స్కూటర్ అమ్మకాలు 17 శాతం ఎగసి 4.9 లక్షల యూనిట్లను తాకాయి.ద్విచక్ర వాహన ఎగుమతులు 16 శాతం బలపడి 2.78 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి. ఇక త్రిచక్ర వాహన అమ్మకాలు 5,000 యూనిట్లు తగ్గి 38,000కు పరిమితమయ్యాయి. ఎలక్ట్రిక్ వాహనాలు 31 శాతం అధికంగా 75,000 యూనిట్లు అమ్ముడయ్యాయి. ఫలితాల నేపథ్యంలో టీవీఎస్ మోటార్ షేరు బీఎస్ఈలో 3.6 శాతం పతనమై రూ. 2,565 వద్ద ముగిసింది.

# రూటు మార్చిన ఐటీ..



### వారికంటే జూనియర్లే బెటరంటున్న కంపెనీలు!
### పొదుపు మంత్రం జపిస్తున్న కంపెనీలు
### వేతన భారం దించే దిశగా అడుగులు
### తగ్గుతున్న మధ్య, ఉన్నతస్థాయి ఉద్యోగులు
### జూనియర్లకు దక్కుతున్న పెద్దపీట

న్యూఢిల్లీ, అక్టోబర్ 23: దేశీయ ఐటీ రంగ సంస్థలు రూటు మార్చాయి. ఇన్నాళ్లూ మధ్య, ఉన్నతస్థాయి ఉద్యోగుల నియామకాలపై దృష్టి సారించిన కంపెనీలు.. ఇప్పుడు జూనియర్లకు పెద్దపీట వేస్తున్నాయి. మిడ్, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల స్థానంలో కొత్తవారిని తీసుకొస్తున్నాయి. అనుభవం ఉన్నవారిని ఎక్కువ జీతాలిచ్చి పెట్టుకోవడం కంటే.. ఫ్రెషర్లను తీసుకొని, వారిలో నైపుణ్యం పెంచేందుకు ఖర్చు పెట్టడమే లాభసాటి అని మెజారిటీ కంపెనీలు భావిస్తున్నాయి మరి. ఉద్యోగులపై పెట్టే వ్యయంలో నైపుణ్యాభివృద్ధికి చేసే ఖర్చు 5-7 శాతంగానే ఉంటున్నది. దీంతో తక్కువ జీతాల్లో జూనియర్ల నియామకాలే ఉత్తమం అన్న భావన యాజమాన్యాల్లో పెరిగిపోతున్నది.

**ట్రెండ్‌కు భిన్నంగా..**

గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ), దేశంలోని బహుళజాతి ఐటీ కంపెనీలు ఆకర్షణీయ వేతనాలతో ఉద్యోగ నియామకాలు చేపడుతున్నాయి. అయినప్పటికీ స్థానిక ఐటీ సంస్థలు మాత్రం పొదుపు మంత్రాన్నే జపిస్తుండటం ఇప్పుడు జాబ్ మార్కెట్‌లో మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. కాగా, భారతీయ ఐటీ సేవల కంపెనీల ఆదాయాల్లో ఎక్కువ మొత్తం పోతున్నది ఉద్యోగుల జీతాలకే. ఈ క్రమంలోనే వేతన భారాన్ని తగ్గిస్తే సంస్థ లాభాలు పెరుగుతాయన్న ఆలోచనతో జూనియర్ల వైపు చూస్తున్నాయిప్పుడు చాలా కంపెనీలు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను ఇటీవల ప్రకటించిన ఆర్థిక ఫలితాలనుబట్టి ఉద్యోగుల జీతాల ఖర్చును ఇప్పటికే ప్రధాన సంస్థలు తగ్గించేసుకున్నాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఇందుకు నిదర్శనం.

**ముమ్ముందు ఇబ్బందే..**

కంపెనీల వైఖరి.. ప్రస్తుతం దేశీయ ఐటీ రంగంలో నెలకొన్న మందగమనాన్ని సూచిస్తున్నట్టు నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలోనే ముమ్ముందూ ఐటీ రంగంలో పెద్దగా ఉద్యోగ నియామకాలు ఉండకపోవచ్చని, ఉన్నా.. అరకొర జీతాలకు ఫ్రెషర్లనే తీసుకుంటారని వారు చెప్తున్నారు. నిజానికి భారతీయ ఐటీ కంపెనీలకు అతిపెద్ద మార్కెట్ అమెరికానే. అగ్రరాజ్యంలో అంతా బాగుంటేనే కొత్త కొలువులకు వీలుంటుంది. అయితే అమెరికా ఎన్నికలు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, ఐరోపా దేశాల్లో క్రిస్మస్, న్యూఇయర్ హాలీడే వాతావరణంతోనూ మార్కెట్ స్తబ్ధత చోటుచేసుకున్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితులు చక్కబడితే నియామకాల్లో జోరు పెరుగుతుందన్న అంచనాలూ ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌తో పోల్చితే జూలై-సెప్టెంబర్‌లో హెచ్‌సీఎల్ రెవిన్యూలో 57.2 శాతానికి తగ్గిన వేజ్ బిల్లు. అంతకుముందు 58.5 శాతం.

- టీసీఎస్‌లోనూ 58.2 శాతం నుంచి 57 శాతానికి తగ్గుదల. ఇన్ఫోసిస్‌లో కూడా 52.6 శాతానికి దిగిన వైనం.
- విప్రోలో మాత్రం వేతన బిల్లు స్వల్పంగా పెరిగి రెవిన్యూలో 60.2 శాతం నుంచి 60.4 శాతానికి చేరింది.
- ఈ జూలై-సెప్టెంబర్‌లో టీసీఎస్‌లోకి 5,726 మంది, ఇన్ఫోసిస్‌లోకి 2,456 మంది . హెచ్‌సీఎల్‌లో 780 మంది, విప్రోలో 502 ఉద్యోగులు తగ్గుదల.
- ఐటీ సంస్థల్లో ఉద్యోగుల నిష్క్రమణకు సూచికగా ఉండే అట్రిషన్ రేటు ఈ జూలై-సెప్టెంబర్‌కుగాను హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టీసీఎస్‌ల్లో 12.9 శాతంగా నమోదు. ఇన్ఫోసిస్‌లో 12.7 శాతం, విప్రోలో 14.5 శాతం.




## పేటీఎంకు ఎన్‌పీసీఐ ఊరట

### కొత్త యూపీఐ యూజర్లను చేర్చుకునేందుకు గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ దిగ్గజం పేటీఎంకు ఊరటనిస్తూ కొత్త యూపీఐ యూజర్లను చేర్చుకునేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐ) అనుమతించింది. నిర్దేశిత మార్గదర్శకాలు, నిబంధనలను పాటించడాన్ని బట్టి అనుమతులు ఉంటాయని ఎన్‌పీసీఐ పేర్కొన్నట్లు ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ (ఓసీఎల్) వెల్లడించింది. నిబంధనలను పదే పదే ఉల్లంఘించినందుకు గాను కార్యకలాపాలు నిలిపివేయాలంటూ ఈ ఏడాది జనవరిలో అనుబంధ సంస్థ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌ను (పీపీబీఎల్) ఆర్‌బీఐ ఆదేశించడం తెలిసిందే.

## బైజూస్‌కు మరో ఎదురుదెబ్బ..

### ఎన్‌క్లాట్ తీర్పును తోసిపుచ్చిన సుప్రీంకోర్టు




న్యూఢిల్లీ: ఎడ్యుకేషన్ టెక్నాలజీ సంస్థ బైజూస్(థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్)కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ సంస్థపై దివాలా చర్యలు చేపట్టకుండా నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్(ఎన్‌క్లాట్) ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు బుధవారం తోసిపుచ్చింది. సెటిల్‌మెంట్ నగదు రూ.158.9 కోట్లను కమిటీ ఆఫ్ క్రెడిటర్(సీఓసీ) వద్ద డిపాజిట్ చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం బీసీసీఐని ఆదేశించింది. ఎన్‌క్లాట్ తీర్పును వ్యతిరేకిస్తూ అమెరికా సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరిపింది. 61 పేజీల తీర్పును వెలువరించింది. ఈ తీర్పుతో బైజూస్‌పై ఆ కంపెనీ వ్యవస్థాపకులైన బైజూ రవీంద్రన్, ఆయన సోదరుడు రిజూ రవీంద్రన్ మరోసారి నియంత్రణ కోల్పోనున్నారు. బీసీసీఐతో రూ.158.9 కోట్ల వ్యవహారాన్ని సెటిల్‌మెంట్ చేసుకోవడానికి బైజూస్ అంగీకరించడంతో ఆ సంస్థపై దివాలా చర్యలు చేపట్టకుండా ఆగస్టు 2న ఎన్‌క్లాట్ తీర్పు ఇచ్చింది.

## భారత్‌లో హెచ్‌పీ ఏఐ ల్యాప్‌టాప్ లాంచ్: ఇదిగో వివరాలు

హెచ్‌పీ భారతదేశంలో తన మొదటి 2 ఇన్ 1 ఏఐ బేస్డ్ 'ఓమ్నీబుక్ అల్ట్రా ఫ్లిప్' అనే కొత్త ల్యాప్‌టాప్ లాంచ్ చేసింది. ఇది ఇంటెల్ లూనార్ లేక ప్రాసెసర్ కోర్ అల్ట్రా సిరీస్ 2 పొందుతుంది. ఈ ప్రాసెసర్లు ఆన్-డివైస్ ఏఐ వర్క్‌లోడ్‌ల కోసం డెడికేటెడ్ న్యూరల్ ప్రాసెసింగ్ యూనిట్ (%చీూఖ%)ని కలిగి ఉంటాయి. క్వాలిటీ వీడియోలను ఆస్వాదించడానికి అనుమతించే.. ఈ ల్యాప్‌టాప్ బ్యాటరీ లైఫ్ కూడా అద్భుతంగా ఉంటుంది.%హెచ్‌పీ ఓమ్నీబుక్ అల్ట్రా ఫ్లిప్ 14 నెక్స్ట్ జెన్ ఏఐ పీసీ అల్ట్రా 7 ప్రారంభ ధర రూ.1,81,999. ఇది ఎక్లిప్స్ గ్రే, అట్మాస్ఫియరిక్ బ్లూ అనే రెండు కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. ఇది భారతదేశంలో కంపెనీ ఆఫ్‌లైన్ స్టోర్‌లలో మాత్రమే కాకుండా.. ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లైన అమెజాన్ ఇండియా, ఫ్లిప్‌కార్ట్‌లలో కూడా అందుబాటులో ఉన్నాయి. అదే విధంగా హెచ్‌పీ ఓమ్నీబుక్ అల్ట్రా ఫ్లిప్ 14 నెక్స్ట్ జెన్ ఏఐ పీసీ అల్ట్రా 9 కూడా రూ.1,91,999 వద్ద అందుబాటులో ఉంది. ఇది అట్మాస్ఫియరిక్ బ్లూ కలర్‌లో మాత్రమే లభిస్తుంది.హెచ్‌పీ లాంచ్ చేసిన ఈ కొత్త ల్యాప్‌టాప్‌లను ఈ నెల చివరి (అక్టోబర్ 31) లోపల కొనుగోలు చేస్తే రూ.9,999 విలువైన అడోబ్ ఫోటోషాప్ ఎలిమెంట్, ప్రైమరీ ఎలిమెంట్స్ వంటి వాటిని ఉచితంగా పొందవచ్చు. అంతే కాకుండా వినియోగదారులు బజాజ్ ఫైనాన్స్‌తో నో కాస్ట్ ఈఎమ్ఐ కింద కూడా కొనుగోలు చేయవచ్చు.హెచ్‌పీ ఓమ్నీబుక్ అల్ట్రా ఫ్లిప్ 14 ఇంచెస్ 2.8కే ఓఎల్ఈడీ డిస్‌ప్లే పొందుతుంది. మెరుగైన వీడియో కాన్ఫరెన్సింగ్ కోసం హాప్టిక్ టచ్‌ప్యాడ్, 9 మెగాపిక్సెల్ కెమెరాను కూడా కలిగి ఉంది.




## కొత్త ఆండ్రాయిడ్15లో అబ్బురపరిచే ఫీచర్లు

సరికొత్త గూగుల్ ఆపరేటింగ్ సిస్టమ్ ఆండ్రాయిడ్ 15 అందుబాటులోకి వచ్చేసింది. స్మార్ట్‌ఫోన్‌లను మరింత మెరుగ్గా చేసేందుకు ఇందులో అనేక కొత్త ఫీచర్లను జోడించారు. వీటిలో అబ్బురపరిచే కొన్ని ఫీచర్లను ఇక్కడ తెలుసుకుందాం..ప్రైవేట్ స్పేస్ అనేది వర్చువల్ లాకర్. వ్యక్తిగతమైన, గోప్యమైన యాప్‌లను ఇక్కడ ఉంచవచ్చు. ఈ యాప్‌లను మీరు మాత్రమే యాక్సెస్ చేయగలిగేలా భద్రతను ఇస్తుంది. ముఖ్యంగా పిల్లలకు ఫోన్ ఇచ్చే పేరెంట్స్‌కు ఇది బాగా ఉపయోగపడుతుంది. బ్యాంకింగ్, షాపింగ్ వంటి యాప్‌లు ఇక్కడ సురక్షితంగా ఉంటాయి.

**చార్జింగ్ లిమిట్ :** ఎక్కువ సేపు చార్జింగ్ పెట్టడం వల్ల బ్యాటరీ జీవిత కాలం తగ్గిపోతుంది. ఈ సమస్య పరిష్కారం కోసం ఆండ్రాయిడ్ 15లో 80% లిమిట్ ఆప్షన్ తీసుకొచ్చారు. దీని ద్వారా బ్యాటరీ తొందరగా దెబ్బతినకుండా నివారించుకోవచ్చు.

**థెఫ్ట్ ప్రొటెక్షన్:** ఆండ్రాయిడ్ 15లో తీసుకొచ్చిన థెఫ్ట్ ప్రొటెక్షన్ ఫీచర్ అసాధారణ చర్యలతో మీ ఫోన్‌ను ఎవరైనా చోరీ చేయడానికి ప్రయత్నించి ఉంటే తెలియజేస్తుంది. ఒక వేళ మీ ఫోన్ చోరీకి గురైతే మీ డేటాను రక్షించడానికి, ఫ్యాక్టరీ రీసెట్ చేయకుండా ఇది ఆటోమేటిక్‌గా లాక్ చేస్తుంది. మీ ఫోన్ నంబర్‌ని ఉపయోగించి వేరొక ఫోన్ నుంచి మీ ఫోన్‌ను లాక్ చేయవచ్చు.

క్రైమ్ మిర్రర్
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు,
నియోజకవర్గం, మండలాలవారీగా
అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈ క్రింది
నెంబరుకు సంప్రదించగలరు.
93934 46188




## రాణి అల్విదా

### 16 ఏండ్ల హాకీ కెరీర్‌కు వీడ్కోలు పలికిన మాజీ సారథి

ఢిల్లీ: భారత హాకీ జట్టు మాజీ సారథి రాణి రాంపాల్ అంతర్జాతీయ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించింది. 16 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు గురువారం తెలిపింది. భారత్ తరఫున 254 మ్యాచ్‌లు ఆడి 205 గోల్స్ చేసిన రాణి.. 14 ఏండ్ల వయసులోనే (2008లో) అంతర్జాతీయ స్థాయిలో అరంగేట్రం చేసింది. హర్యానాలోని అత్యంత పేద కుటుంబంలో పుట్టిన రాణి ఎన్నో ఒడిదొడుకులను దాటుకుని అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటింది. రాణి సారథ్యంలో భారత జట్టు 2018 హాకీ వరల్డ్‌కప్‌లో క్వార్టర్స్ చేరడమే గాక అదే ఏడాది ఆసియా క్రీడల్లో రజతం నెగ్గింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలవడంలోనూ రాణి పాత్ర కీలకం. 29 ఏండ్ల వయసులోనే కెరీర్‌కు గుడ్ బై చెప్పిన రాణిని 2020లో కేంద్ర ప్రభుత్వం మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్రత్నతో పాటు పద్మశ్రీ అవార్డులతో సత్కరించింది.

# అదిరిందయ్యా సుందర్

## ఏడు వికెట్లతో చెన్నై చిన్నోడు విజృంభణ

## తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 259 ఆలౌట్.. అశ్విన్‌కు మూడు వికెట్లు భారత్ 16/1

**పుణె వేదికగా భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో టెస్టు రసవత్తరంగా సాగుతున్నది. బెంగళూరు టెస్టులో భారీ ఓటమితో వెనుకంజలో ఉన్నటీమ్ఇండియా సిరీస్‌లో పుంజుకోవాలన్న పట్టుదలతో బరిలోకి దిగితే..దీటైన పోటీనిచ్చేందుకు కివీస్ సిద్ధమైంది. స్పిన్‌కు సహకరిస్తుందన్న అంచనాలను నిజం చేస్తూ తొలి రోజే యువ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ ధాటికి కివీస్ మొదటి ఇన్నింగ్స్‌లో 259 పరుగులకు ఆలౌటైంది. సీనియర్ స్పిన్నర్ అశ్విన్ వికెట్ల వేట మొదలుపెడితే..చాలా రోజుల తర్వాత టెస్టు టీమ్‌లోకి వచ్చిన సుందర్ ఏడు వికెట్లతో విజృంభించాడు. కివీస్ బ్యాటర్లకు తన స్పిన్ తంత్రంతో కళ్లెం వేస్తూ టీమ్ ఇండియాను పోటీలోకి తీసుకొచ్చాడు. సుడిగాలి స్పిన్‌తో వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టి కెరీర్‌లో అత్యుత్తమ గణాంకాలు సొంతం చేసుకున్నాడు. కివీస్‌ను కట్టడి చేశామన్న ఆనందం భారత్‌కు ఎక్కువసేపు నిలువలేదు.తొలి ఇన్నింగ్స్‌కు దిగిన టీమ్ ఇండియా..కెప్టెన్ రోహిత్ వికెట్ కోల్పోయి ఇబ్బందుల్లో పడింది.రెండో రోజు ఆటలో భారత బ్యాటర్లు ఎలా రాణిస్తారనే దానిపై మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంది.**



పుణె: భారత్, న్యూజిలాండ్ మధ్య పుణె వేదికగా జరుగుతున్న రెండో టెస్టు తొలి రోజు ఆటలో రోహిత్ సేన పూర్తిస్థాయి ఆధిపత్యం ప్రదర్శించింది. స్పిన్‌కు అనుకూలించిన పుణె పిచ్‌పై చెన్నై చిన్నోడు వాషింగ్టన్ సుందర్ (7/59) ఏడు వికెట్లతో విజృంభించాడు. సుందర్ తన కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శన నమోదుచేయడంతో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కివీస్ 79 ఓవర్లలో 259 పరుగులకు ఆలౌట్ అయింది. సుమారు మూడేండ్ల తర్వాత టెస్టు జట్టులో చోటు దక్కించుకున్న అతడి మాయాజాలానికి పర్యాటక జట్టు బ్యాటర్లు క్రీజులో నిలువలేకపోయారు. డెవాన్ కాన్వే (76), రచిన్ రవీంద్ర (65), మిచెల్ శాంట్నర్ (33) ఆ జట్టును ఆదుకున్నారు. సుందర్‌తో పాటు సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ (3/64) రాణించడంతో కివీస్ తక్కువ స్కోరుకే పరిమితమైంది. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన టీమ్ఇండియా.. ఆదిలోనే రోహిత్ శర్మ(0) వికెట్ కోల్పోయి మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 16 పరుగులు చేసింది. యశస్వీ జైస్వాల్ (6 నాటౌట్), శుభ్‌మన్ గిల్ (10 నాటౌట్) క్రీజులో ఉన్నారు.

**ఆరంభంలో అశ్విన్..**

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన కివీస్ మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. భారత్ మూడు మార్పులతో బరిలోకి దిగింది. కేఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్, కుల్‌దీప్ యాదవ్‌ను పక్కనబెట్టి గిల్, ఆకాశ్ దీప్, వాషింగ్టన్‌తో బరిలో నిలిచింది. ఆరంభ ఓవర్లలో పేసర్లు పెద్దగా ప్రభావం చూపకపోవడంతో 8వ ఓవర్లోనే రోహిత్.. అశ్విన్‌కు బంతినిచ్చాడు. ఆ ఓవర్ ఐదో బంతికే అశ్విన్.. కివీస్ సారథి టామ్ లాథమ్ (15)ను వికెట్ల ముందు బలిగొనడంతో ఆ జట్టు తొలి వికెట్ కోల్పోయింది. అనంతరం కొద్దిసేపటికే విల్ యంగ్ (18) వికెట్ల వెనుక పంత్‌కు క్యాచ్ ఇచ్చాడు. అయితే కాన్వేకు రచిన్ తోడవడంతో ఈ ఇద్దరూ భారత స్పిన్నర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. లంచ్ తర్వాత బుమ్రా వేసిన తొలి ఓవర్లోనే మూడు బౌండరీలు బాది అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్నాడు. మూడంకెల స్కోరు దిశగా సాగుతున్న అతడు 44వ ఓవర్లో అశ్విన్ వేసిన బంతి కాన్వే బ్యాట్‌కు ముద్దాడి పంత్ చేతిలో పడటంతో 62 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

### సంక్షిప్త స్కోర్లు

**న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్:** 259 ఆలౌట్ (కాన్వే 76, రచిన్ 65, సుందర్ 7/59, అశ్విన్ 3/64)

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 16/1 (గిల్ 10, జైస్వాల్

**సుందర్ మాయ..**

కాన్వే నిష్క్రమించినా డారిల్ మిచెల్ (18)తో కలిసి రచిన్ కివీస్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 59 పరుగులు జోడించారు. కానీ రెండో సెషన్ డ్రింక్స్ విరామానికి రెండు ఓవర్ల ముందు సుందర్ మాయ మొదలైంది. 60వ ఓవర్ తొలి బంతికే అతడు అద్భుతమైన డెలివరీతో రచిన్‌ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. తన మరుసటి ఓవర్లోనే టామ్ బ్లండెల్ (3)నూ పెవిలియన్‌కు పంపడంతో ఇక అప్పట్నుంచి కివీస్ కోలుకోలేదు. డ్రింక్స్ తర్వాత రెండో ఓవర్లో మిచెల్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న వాషింగ్టన్.. గ్లెన్ ఫిలిప్స్ (9)ను బౌల్డ్ చేసి ఆ జట్టును మరింత దెబ్బకొట్టాడు. సౌథీ (5)ని ఔట్ చేసి తన కెరీర్‌లో తొలిసారి ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. చివర్లో ధాటిగా ఆడిన శాంట్నర్ (33)ను బౌల్డ్ చేసి కివీస్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో వాషింగ్టన్ ఏడు వికెట్లు తీస్తే అందులో ఏకంగా ఐదుగురు బ్యాటర్లు క్లీన్‌బౌల్డ్ కావడం విశేషం.

**తమిళ తంబీల హవా**

కివీస్‌తో టెస్టు ఆడుతూ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసిన భారత బౌలర్లలో సుందర్ నాలుగో స్థానంలో ఉన్నాడు. గతంలో శ్రీనివాస వెంకట్రాఘవన్ (8/72-1965), ఈఎఎస్ ప్రసన్న (8/76-1975), అశ్విన్ (7/59-2017), సుందర్ కంటే ముందున్నారు. పై నలుగురిలో ప్రసన్న మినహా మిగిలిన ముగ్గురూ తమిళనాడుకు చెందినవారే కావడం గమనార్హం.




## అమ్మాయిల బోణీ

అహ్మదాబాద్: భారత మహిళా క్రికెట్ జట్టు ఆల్‌రౌండర్ దీప్తిశర్మ (41, 1/35) ఆల్‌రౌండ్ షోతో అహ్మదాబాద్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో టీమ్ఇండియా ఘన విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన మొదటి వన్డేలో మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. 44.3 ఓవర్లలో 227 పరుగులు చేసింది. తేజల్ హసబ్నిస్ (42), దీప్తి, యస్తికా భాటియా (37) రాణించారు. అనంతరం ఛేదనలో న్యూజిలాండ్ అమ్మాయిలు 40.4 ఓవర్లలో 168 పరుగులకే కుప్పకూలారు. స్పిన్నర్ రాధా యాదవ్ (3/35), అరంగేట్ర పేసర్ సైమా ఠాకూర్ (2/26) కివీస్‌ను దెబ్బకొట్టారు. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది.

## జర్మనీకి భారత్ షాక్



న్యూఢిల్లీ: ప్రపంచ చాంపియన్, పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత జర్మనీ జట్టుతో గురువారం జరిగిన చివరిదైన రెండో మ్యాచ్‌లో టీమిండియా 5%-%3 గోల్స్ తేడాతో జర్మనీని ఓడించింది. భారత్ తరఫున సుఖ్‌జీత్ సింగ్ (34వ, 48వ నిమిషాల్లో), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (42వ, 43వ నిమిషాల్లో) రెండు గోల్స్ చొప్పున చేయగా... అభిషేక్ (45వ నిమిషంలో) ఒక గోల్ సాధించాడు. జర్మనీ జట్టుకు ఇలియన్ మజ్కోర్ (7వ, 57వ నిమిషాల్లో) రెండు గోల్స్ అందించగా... హెన్రిక్ మెర్ట్‌జెన్స్ (60వ నిమిషంలో) ఒక గోల్ చేశాడు. బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత జట్టు 0%-%2తో ఓడిపోయింది. రెండో మ్యాచ్‌లో భారత్ నెగ్గడంతో సిరీస్ 1%-%1తో సమమైంది. ఈ నేపథ్యంలో సిరీస్ విజేతను నిర్ణయించేందుకు ప్రత్యేకంగా 'షూటౌట్' నిర్వహించారు. 'షూటౌట్'లో జర్మనీ 3%-%1తో భారత్‌పై గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకుంది.

GHMC
GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
hmda
Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

## తుఫాన్ ప్రభావంతో పలు రైళ్లు రద్దు

**శ్రీకాకుళం,(క్రైమ్ మిర్రర్):** తుఫాను కారణంగా ఈ నెల 24, 25 తేదీల్లో ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలో అనేక రైళ్లు రద్దు చేసినట్లు రైల్వేశాఖ పీఆర్వో ఓ ప్రకటన విడుదల చేశారు. 24న కటక్-పారాదీప్ స్పెషల్, భువనేశ్వర్-ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-ఆనంద్‌విహార్ ఎక్స్‌ప్రెస్, పూరీ-షాలీమార్, న్యూఢిల్లీ-భువనేవ్వర్ ఎక్స్‌ప్రెస్, బెంగుళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ రద్దు కానున్నాయి. 25న పారాదీప్-పూరీ ఎక్స్‌ప్రెస్, చెన్నై-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్, షాలీమార్-పూరీ, భద్రక్-ఖరగ్‌పూర్ స్పెషల్ రైళ్లను రద్దు చేసినట్టు ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. దానా తుఫాన్ ప్రభావంతో ఈ నెల 24, 25, 26 తేదీల్లో అటు భువనేశ్వర్, ఇటు విజయవాడ వైపు వెళ్లే 51 రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు వెల్లడించారు. రైల్వే ప్రయాణికులకు ఎటువంటి సమాచారం కావాలన్నా హెల్ప్‌లైన్ డెస్క్ సిబ్బందిని లేదా.. టోల్‌ఫ్రీ 08942- 286 213, 85912 85913 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.



# అర్ధరాత్రికి తీరం దాటనున్న దానా తుఫాన్

### ఉత్తరాంధ్రపై తుఫాన్ ప్రభావం
### తీరం వెంబడి బలమైన గాలులు



**విశాఖపట్నం,(క్రైమ్ మిర్రర్):** బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుఫాన్.. ఎలాంటి బీభత్సం సృష్టిస్తుందని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. దానా తుఫాన్ తీవ్ర తుఫాన్‌గా మారిందని వాతావరణశ్శాఖ అధికారులు అన్నారు. అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం మధ్య.. ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరం వద్ద దాటుతుందని తెలిపారు. ఈ సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా ఉత్తరాంధ్రపై తుఫాన్ ప్రభావం ఉంటుందని తెలిపారు. ఉత్తరాంధ్ర తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని వెల్లడించారు. కళింగపట్నం,భీమునిపట్నం, విశాఖపట్నం , గంగవరం పోర్టుల్లో మూడో ప్రమాద హెచ్చరికలు జారీ చేశామని అన్నారు. తుఫాన్ తీరం దాటిన తర్వాత ఉత్తరాంధ్రలో ఉరుములతో కూడిన వర్షాలు పడతాయని తెలిపారు. అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అన్నారు. ఈ సమయంలో మత్స్యకారులు ఎవరు వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు. గురువారం ఒడిశాలో తుఫాన్ తీరం దాటనుంది. తుఫాన్ ప్రభావం జిల్లాపై ఎక్కువగా చూపనుందని.. ఇప్పటికే వాతావరణ శాఖ అంచనా వేసింది. గురువారం బలమైన ఈదురుగాలులు.. గంటకు 80 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని వెల్లడించింది. దీంతో జిల్లా అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అప్రమత్తం చేశారు. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ (08942-240557) ఏర్పాటు చేశారు. ప్రతి మండల కేంద్రంలోనూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయించారు. తుఫాన్ తీరం దాటాక.. భారీవర్షాలు రెండు రోజుల పాటు కురుస్తాయని.. పైగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సోంపేట, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి మండలాలపై ఎక్కువగా ప్రభావం ఉంటుందని నివేదికలో వెల్లడైంది. దీంతో ఆయా మండలాల్లో అధికారులను కలెక్టర్ అప్రమత్తం చేశారు. ప్రజలందరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అవసరమైతే కంట్రోల్‌రూమ్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి రెండు గంటలకు ఇచ్ఛాపురం నియోజకవర్గం గురించి ప్రత్యేక బులిటెన్ విడుదల చేయనున్నారు. తీరప్రాంత మండలాల్లో తుపాను ప్రభావాన్ని.. నష్టాన్ని గుర్తించేందుకు.. ఇరవై డ్రోన్లను సిద్ధం చేశారు. సమాచారాన్ని ఎప్పటికప్పుడు గూగుల్ షీట్స్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకున్నారు. అలాగే నాగావళి, వంశధార, బహుదా నదులు.. సాగునీటి చెరువులు... సముద్ర తీరప్రాంతాల వద్ద ప్రజలు వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేశారు. తుఫాన్ రక్షణ చర్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడారు. ప్రజలకు ఏవిధమైన నష్టం కలగకుండా.. సకాలంలో సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రణస్థలం మండలం కొవ్వాడ నుంచి ఇచ్ఛాపురం మండలం డొంకూరు సముద్రతీరం వరకు బుధవారం సాయంత్రం నుంచీ ఈదురుగాలులు వీస్తున్నాయి. అలలు ఎగసి పడుతున్నాయి. తుఫాన్ నేపథ్యంలో ప్రధానంగా ఉద్దానం ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తితలీ తుఫాన్ సృష్టించిన బీభత్సాన్ని ఇప్పటికీ మరచిపోలేకపోతున్నారు. తాజాగా దానా తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసు కోవడంతో రైతుల్లో ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో హిరమండలం, జలుమూరు తదితర మండలాల్లో వరి పంట కోత దశకు చేరుకుంది. ఈ సమయంలో తుఫాన్ వస్తే.. తమకు పంట నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.25వేలకు పైగా ఖర్చు చేశామని.. పంట చేతికి అందివచ్చే సమయంలో తుఫాన్ ముప్పు వెంటాడుతోందని ఆవేదన చెందుతున్నారు.

## ఆరేళ్లయినా కార్యకలాపాలు ఏవీ

### సరస్వతీ పవర్‌కు భూములను రద్దు చేయండి
### తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** ఆస్తి కోసం తల్లి, చెల్లిని బ్లాక్‌మెయిల్ చేసిన జగన్‌ను మాజీ సీఎం అని పిలవాలన్నా అసహ్యం వేస్తోందని మాజీ మంత్రి, తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆస్తి ఇవ్వనంటూ కోర్టుకెళ్లడం ఆయన క్రూర మనస్తత్వానికి నిదర్శనమని దుయ్యబట్టారు. జగన్ అనుభవిస్తున్న ఆస్తి ప్రజలదని వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడారు. సరస్వతీ పవర్‌కు కేటాయించిన ప్రభుత్వ భూమి లీజు 30 ఏళ్లకు జగన్ పొడిగించుకున్నారని సోమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ 6 ఏళ్ల వరకూ కార్యకలాపాలు ప్రారంభించకపోవడం నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. ఆ భూ కేటాయింపులను ప్రభుత్వం ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలని నిలదీశారు. నిబంధనలకు విరుద్ధంగా సరస్వతి పవర్ యాజమాన్యం వ్యవహరించినందున కేటాయింపులు రద్దు చేయాలని సీఎం చంద్రబాబును కోరారు. ప్రజల ఆస్తులు కూడగట్టుకున్న జాబితాలో జగన్‌ది దేశంలో 2వ స్థానమని ఆరోపించారు. కాంగ్రెస్‌తో ఆయన జరుపుతున్న మంతనాలు ఇప్పటికే బయటకు తెలిశాయన్నారు. ఏ తల్లి అయినా తన పిల్లలందరినీ సమానంగా చూసుకుంటుందని.. కానీ జగన్ క్రూరత్వం గ్రహించే షర్మిలతో విజయమ్మ ఉండాల్సి వస్తోందన్నారు. జగన్ క్రూరత్వంపై ఓ దర్శకుడు సినిమా సన్నివేశం తీశారంటూ వీడియోను సోమిరెడ్డి ప్రదర్శించారు. జగన్ ఒప్పుకుంటే సరస్వతీ పవర్ 1500 ఎకరాలను 3 భాగాలు చేసి ఒక భాగం రైతులకిచ్చి.. మిగిలిన 2 భాగాలను జగన్, షర్మిలకు సమానంగా పంచుతామన్నారు.

## జగన్ మనస్తత్వం మరోసారి నిరూపితమైంది: తులసిరెడ్డి

**విజయవాడ,(క్రైమ్ మిర్రర్):** జగన్ మనస్తత్వం ఏంటో మరోసారి నిరూపితమైందని కాంగ్రెస్ సీనియర్ నేత తులసిరెడ్డి అన్నారు. డబ్బుకోసం తల్లి, చెల్లిని కూడా దూరం పెట్టగలనని ఆయన మళ్లీ నిరూపించారని వ్యాఖ్యానించారు. కడపలో మీడియాతో తులసిరెడ్డి మాట్లాడారు. కుటుంబ ఆస్తిపాస్తుల విషయంలో జగన్‌కు డబ్బే ప్రధానమన్నారు. ఆస్తుల వాటా విషయం భవిష్యత్తులో రాజకీయంగా ఆయనకు చాలా నష్టాలను తెచ్చిపెడుతుందని చెప్పారు.


## కాశ్మీర్‌లో రెచ్చిపోయిన ఉగ్రవాదులు

### కాల్పుల్లో ఒకరికి తీవ్ర గాయాలు

**శ్రీనగర్,(క్రైమ్ మిర్రర్):** జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. పుల్వామాలోని స్థానికులపై ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డారు. గురువారం ఉదయం జిల్లాలోని త్రాల్ ప్రాంతంలో జరిపిన కాల్పుల్లో ఒక కార్మికుడు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. బటాగుండ్ గ్రామంలో టెర్రరిస్టులు కాల్పులు జరపడంతో బిజ్నోర్‌కు చెందిన శుభమ్ కుమార్ చేతికి బుల్లెట్ గాయమైందని అధికారులు వెల్లడించారు. ఉగ్రవాదుల కోసం ఆర్మీ అధికారులు గాలిస్తున్నారు. ఆదివారం ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు కార్మికులు, ఒక వైద్యుడు మరణించిన ఘటన తీవ్రకలకలం రేపింది. నాలుగురోజుల్లోనే మరోసారి దాడికి పాల్పడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వారంరోజుల్లో ఉగ్రవాదులు మూడుసార్లు కాల్పులకు పాల్పడటం కలకలం రేపింది.

# ఇన్ని లక్షల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి

### విలువలు లేని వారు సమాజానికి చేటు
### జగన్ ఆస్తుల వ్యవహారంపై చంద్రబాబు మండిపాటు



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మరోసారి ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు తీవ్ర విమర్శలు గుప్పించారు. తండ్రి సంపాదించిన ఆస్తి ఆయన భార్యకు రాదా అని ప్రశ్నించారు. 2004లో జగన్ ఆదాయం ఎంత..ఇవన్నీ ఎక్కడినుంచి వచ్చాయి ఈ లక్షల కోట్లు అని నిలదీశారు. ఇలాంటి వారితో రాజకీయం చేయలంటే సిగ్గుగా ఉందని విమర్శించారు. వంకర రాజకీయాలు, చిల్లర రాజకీయాలు ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. విలువలు లేని మనుషులు సమాజానికి చేటని విమర్శలు చేశారు. ప్రభుత్వంలో ఉండగా ఎప్పుడైనా ఇచ్చారా ప్రజలను ఆదుకున్నారా అని అడిగారు.. ఇప్పుడేమో రూ. 10లక్షలు ఇచ్చే శక్తి ఇప్పుడు వచ్చిందా అని ప్రశ్నించారు. జగన్ దగ్గర ఉన్న డబ్బు ప్రజలకు ఇవ్వాలని.. అలా అయినా అవినీతి డబ్బు ప్రజలకు చేరుతుందని అన్నారు. ఐదేళ్లు ఇంట్లో నుంచి తనను బయటకు రానివ్వలేదని మండిపడ్డారు. ఇప్పుడు తిడుతున్నారుగా వారిని ఆపాలంటే ఎంత సేపు ఒక్కనిముషమని వార్నింగ్ ఇచ్చారు. విలువలు లేని రాజకీయం చేసి అందులో హీరోయిజం చేయాలనుకుంటే ఇక కలేనని విమర్శించారు..ఆస్తిలో వాటా ఇవ్వనంటూ తల్లి, చెల్లిని జగన్ రోడ్డుపైకి లాగారు. మమ్మల్ని నిందిస్తూ జగన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. జగన్ లాంటి వ్యక్తులతో రాజకీయాలు చేస్తాననుకోలేదు. ఆస్తిలో వాటా ఇవ్వాలంటే జగన్‌ను విమర్శించకూడదని షరతు పెట్టారు. ఇలాంటి వారితో రాజకీయం చేయాలంటే సిగ్గనిపిస్తోంది. వైకాపాలో ఉన్నామని చెప్పుకొనేందుకు ఆ పార్టీ నేతలు సిగ్గుపడుతున్నారు. జగన్ ప్రభుత్వం దాచిపెట్టిన చీకటి జీవోలపై విచారణ జరిపిస్తాం. చీకటి జీవోల్లోని అక్రమాలు నిగ్గుతేల్చి గత తప్పిదాలు సరిదిద్దుతాం‘ అని సీఎం తెలిపారు.

## జగన్‌కు ఆనాడు లేని ప్రేమ ఇప్పుడే ఎందుకు వచ్చిందో

### గుర్ల డయేరియాపై విచారణ జరుగుతోంది: అనిత




**విజయనగరం,(క్రైమ్ మిర్రర్):** గుర్ల డయేరియా పరిస్థితిపై హోంమంత్రి అనిత స్పందిస్తూ.. మరణాలపై విచారణ సాగుతోందని అన్నారు. మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్‌కి సడన్‌గా ప్రజల మీద ప్రేమ పుట్టడం ఆశ్చర్యకరమని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఏపీలో చాలామంది డయేరియాతో చనిపోయిన జగన్ ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఒక్కరిని కూడా ఎందుకు పరిమర్శించలేదు? ఎందుకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించలేదు? అని హోంమంత్రి అనిత ప్రశ్నించారు. డయేరియా ప్రబలిన దగ్గర నుంచి మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని తెలిపారు. డయేరియా ప్రబలైన తర్వాత మరణాలు సంభవించడం బాధాకరమని అన్నారు. వారు ఎలా చనిపోయారనే విషయంపై విచారణ జరుగుతుందని తెలిపారు. బోర్లలో బ్యాక్టీరియా ఉన్నందున ట్యాంక్‌ల ద్వారా వాటర్ సరఫరా చేస్తున్నామని వివరించారు. తమ ప్రభుత్వ తీసుకుంటున్న చర్యలతో గత మూడు రోజులనుంచి కొత్త కేసులు నమోదు కాలేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నాయకుల తీరుతో అధికారులు కూడా కొంత నిర్లక్ష్యం వహించారని హోంమంత్రి అనిత మండిపడ్డారు. వాటర్ పైప్ లైన్‌లు మురుగు నీటి కాలువల్లో ఉన్నాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వం చెత్త మీద మాత్రం పన్ను వేసింది కానీ చెత్త ఎత్తలేదని విమర్శించారు. జగన్ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం హూద్ హుద్ నుంచి చూస్తున్నామని? కానీ ఎక్కడా ఇవ్వలేదని అన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని బోర్‌వేల్స్, అన్ని వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలని ఆదేశాలు జారీ చేశామని అన్నారు. గత ఐదేళ్లలో ఒక్క వాటర్ ట్యాంక్‌లో కూడా క్లోరినేషన్ జరగలేదని హోంమంత్రి అనిత చెప్పారు. గ్రామ పంచాయతీల నిధులు కూడా జగన్ దోచుకున్నారని విమర్శించారు.

## గుర్ల డయేరియా మరణాలను కప్పిపుచ్చారు

### గ్రామాల్లో ఆనాటి పరిస్థితులు ఇప్పుడు కానరావడం లేదు
### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ వైఎస్ జగన్



**విజయనగరం,(క్రైమ్ మిర్రర్):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి గురువారం విజయనగరం జిల్లా గుర్లలో పర్యటించారు. డయేరియా బాధితులను పరామర్శించారు. గతంలో వైసీపీ హయాంలో గ్రామ స్వరాజ్యం తీసుకువచ్చి గ్రామాలను సస్యశ్యామలంగా తీర్చదిద్దామని.. ఈ రోజున పరిస్థితులు ఎలా ఉన్నాయో ప్రజలు ఒకసారి గమనించాలని జగన్ అన్నారు. ఆ రోజు ఏ గ్రామానికి వెళ్లినా సచివాలయాలు కనిపించేవని, వివిధ శాఖలకు సంబంధించి పనులు చేయించామన్నారు. ప్రతి గ్రామంలోనూ గ్రామ స్వరాజ్యం కనిపించేదన్నారు. గుర్ల గ్రామంలో డయేరితో 14 మంది చనిపోయారన్న వాస్తవాన్ని కూడా ఈ ప్రభుత్వం అంగీకరించలేని పరిస్థితిలో ఉందని, కూటమి ప్రభుత్వంలో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని జగన్ విమర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతుండగా ప్రజల్లో గందరగోళం చెలరేగింది. దీంతో జగన్ ఎంత సర్ది చెప్పినా వారు వినకపోవడంతో ప్రజలపై అసహనం వ్యక్తం చేశారు. ప్రెస్‌మీట్‌లో మీడియాతో మాట్లాడాలా.. వద్దా... అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు, పోలీసులపై మండిపడ్డారు. తనకు తానే ప్రతిపక్ష హోదా ఇచ్చుకున్న జగన్.. లేని ప్రతిపక్ష నేత హోదాను ఉన్నట్టు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే స్థానిక వైసీపీ నేతలు సర్ది చెప్పడంతో జగన్ మళ్లీ మీడియాతో మాట్లాడారు. తన తల్లి, చెల్లి ఫోటోలు పెట్టి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, ప్రతి ఇంట్లో కుటుంబ కలహాలు ఉంటాయని జగన్ అన్నారు.



# ప్రభాస్ బర్త్‌డే గిఫ్ట్ రాజాసాబ్ స్పెషల్ మోషన్ పిక్చర్ విడుదల

ప్రభాస్ హీరోగా దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న చిత్రం 'ది రాజాసాబ్' మాళవికా మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా విడుదలకు సిద్ధం అవుతోంది. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా టీమ్ సర్‌ప్రైజ్ ఇచ్చింది. స్పెషల్ వీడియోతో మోషన్ పోస్టర్‌ను విడుదల చేసింది. అందులో ప్రభాస్ సింహాసనం మీద ఓ చేతిలో సిగార్‌తో రాజు లుక్‌లో కనిపించి అభిమానుల్లో జోష్ నింపారు. హారర్, కామెడీ నేపథ్యంతో ఈ సినిమా రూపొందుతోంది. ఈ క్రేజీ ప్రాజెక్టు అప్‌డేట్స్ కోసం అభిమానులు ఎంతోకాలంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రభాస్ పుట్టినరోజు నుంచి తరచుగా అప్‌డేట్స్ ఉంటాయని ఇటీవల నిర్మాత చెప్పారు. అందరినీ రాజాసాబ్ ప్రపంచంలోకి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇటీవల ప్రభాస్ లుక్‌కు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేయగా అది క్షణాల్లో వైరలైంది. అందులో గళ్ల చొక్కా, కళ్లద్దాలు పెట్టుకుని స్టైల్‌గా నడుస్తూ కనిపించారు ప్రభాస్.

# ఒకరోజు ముందే ప్లాన్స్ పుష్ప-2 విడుదలకు




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటోన్న 'పుష్ప 2 ది రూల్' సినిమాపై ఆకాశమే అవధి అన్నట్లుగా అంచనాలున్నాయి. అయితే ఈ సినిమా కోసం ఎంతగానో వేచి చూస్తున్న వారందరికీ ఓ గుడ్ న్యూస్. తాజాగా అందుతోన్న సమాచారం ప్రకారం 'పుష్ప 2' చిత్రం ప్రకటించిన డేట్ కంటే ఒకరోజు ముందుగానే విడుదల కానుందని తెలుస్తోంది. డిసెంబర్ 5 రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లుగా సమాచారం. దీనికి సంబంధించి గురువారం నిర్మాతల నుంచి అధికారిక ప్రకటన రానుందని తెలుస్తోంది. గురువారం హైదరాబాద్‌లో 'పుష్ప 2 ది రూల్' మీడియా సమావేశం గ్రాండ్‌గా జరగబోతోంది. ఈ సమావేశంలో ఈ సినిమా విడుదలకు సంబంధించిన మేకర్స్ ఒక రోజు ముందుగానే అనే ప్రకటన చేయబోతున్నారనేది లేటేస్ట్ అప్డేట్. ఈ మీడియా సమావేశానికి మైత్రీ మూవీ మేకర్స్ ప్రొడ్యూసర్స్‌తో పాటు, హిందీ వెర్షన్‌ను విడుదల చేస్తున్న అనిల్ తడానీ, తమిళ్ వెర్షన్ రిలీజ్ చేస్తోన్న ఎజిఎస్ సంస్థ ప్రతినిధులు, డిస్టిబ్యూటర్స్ హాజరుకానున్నారనేది తాజా సమాచారం.



# పుష్ప-2లో శ్రద్ధకపూర్‌తో ఐటమ్ సాంగ్ ?

టాలీవుడ్ స్టార్ దర్శకుడు సుకుమార్ సినిమాలలో స్పెషల్ సాంగ్‌లు ఎంత ఫేమస్ అనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తన మొదటి సినిమా ఆర్యలో మొదలైన ఈ సెంటిమెంట్ నాన్నకు ప్రేమతో సినిమాలో తప్ప ప్రతి సినిమాలో కొనసాగుతుంది. అ అంటే అమలాపురం, 36-24-36, రింగ రింగా, డియాలో డియాలా, జిగేల్ రాణి, లండన్ బాబు, ఊ అంటావా మావ.. సాంగ్‌లతో ప్రేక్షకులకు అలరించాడు. అయితే ఆయన దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం పుష్ప ది రూల్ ఐకానిక్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ పుష్ప సినిమాకు సీక్వెల్‌గా వస్తుంది. రష్మిక మందాన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమాలో స్పెషల్ సాంగ్‌కు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ సినిమాలో బాలీవుడ్ భామ శ్రద్ధ కపూర్ ఐటం సాంగ్ చేయబోతున్నట్లు తెలుస్తుంది. ఇటీవలే స్త్రీ 2 సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకుంది ఈ భామ. అయితే పుష్పకి ఉన్న క్రేజ్‌కి శ్రద్ధ కపూర్ అయితేనే సరిగ్గా సరిపోతుందని అందుకనే స్త్రీ భామను ఇందులో తీసుకుబోతున్నట్లు సమాచారం.

# నాకు ప్రేమించే సమయం లేదు

## నటి సునయన మనోగతం వెల్లడి

తనకు ఇతరులను ప్రేమించే సమయం లేదని, ఇప్పటి వరకు సినిమానే ప్రేమిస్తున్నానని హీరోయిన్ సునయన స్పష్టం చేసింది. 'రెజీనా' సినిమా తర్వాత 'రాకెట్ డ్రైవర్' సినిమాలో నటించిన సునైన ఆ చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొని తనకు ఎదురైన ఓ ప్రశ్నకు సునైనా ఘాటుగా సమాధానమిచ్చారు. 'నేను ఎల్లవేళలా సినిమాను మాత్రమే ప్రేమిస్తున్నానని, ఎవరిపైనా ప్రేమ లేదు. నాకు ఖాళీ దొరికిన సమయాల్లో వెబ్ సిస్‌లు చూడటం ఎంటర్‌టైన్మెంట్‌గా పెట్టుకున్నానని దీంతో అనేక విషయాలను నేర్చుకుంటున్నా' అని అన్నారు. కాగా, ఆమధ్య సునయన ఓ వేలుకు డైమండ్ రింగు పట్టుకుని 'లాక్' అనే క్యాప్షన్‌తో ఓ ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో సోషల్ మీడియాలో సునైన ఓ దుబాయ్ యూట ట్యూబర్‌ను పెళ్లి చేసుకోబోతుందంటూ విస్తృతంగా ప్రచారం జరిగింది. ఈ ప్రచారానికి సునైన ఫుల్‌స్టాప్ పెట్టారు. 2005లో కుమార్ వర్సెస్ కుమారి అనే తెలుగు సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ అచ్చ తెలుగు అందం ఆ తర్వాత ఇక్కడ రెండు,మూడు తెలుగు చిత్రాలు చేసిన సరైన గుర్తింపు దక్కక తమిళంలో పేరు తెచ్చుకుంది. ఆపై అడపదడపా తెలుగు సినిమాలు, వెబ్ సిరీస్‌లలో నటిస్తోంది. చివరగా తెలుగులో శ్రీ విష్ణు హీరోగా వచ్చిన రాజ రాజ చోర అనే తెలుగు చిత్రం, నాని మీట్ క్యూట్, చదరంగం వెబ్ సిరీస్‌లలోనూ నటించింది. రెండు నెలల క్రితం రెజీనా అనే తమిళ చిత్రం, ఇన్ స్పెక్టర్ రిషి సిరీస్‌లతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.



# కథా ప్రాధాన్యం ఉన్న సినిమాలకే ఓటు

## మనసులో మాట చెప్పిన నిత్యామీనన్



ఆకర్షించే అందం, ఆకట్టుకొనే అభినయం మెండుగా, నిండుగా కలిగిన సుందరీ మణులు చాలా అరుదుగా ఉంటారు. అలాంటివారి జాబితాలో ఎప్పుడూ ఉండే ఒక పేరు నిత్యామీనన్ . మలయాళీ అయినప్పటికీ.. తెలుగు నేర్చుకొని మరీ, తన పాత్రకు తనే డబ్బింగ్ చెప్పుకొనే స్థాయికి ఎదిగింది ఆమె. ఎలాంటి పాత్రనైనా అవలీలగా పోషించి మెప్పించగలిగే టాలెంట్ ఆమె సొంతం. ముందు నుంచీ గ్లామర్ పాత్రలపై ఎలాంటి ఆసక్తి చూపకుండా.. కేవలం తన అభినయానికే మొదటి ప్రాధాన్యతనిచ్చిన ఆ బ్యూటీ తెలుగులో ఎన్నో మెమరబుల్ మూవీస్‌లో నటించి ప్రేక్షకుల ఆరాధ్య కథానాయిక అయింది. అయితే ఇటీవల ఆమె ధనుష్ హీరోగా నటించిన 'తిరుచిత్రాంబళం' అనే తమిళ సినిమాకి జాతీయ అవార్డు పొందారు. కాగా ఈ విషయంపై విమర్శలు నెలకొన్నాయి. అవార్డులు ప్రకటించి చాలా రోజులే అవుతున్న ఇంకా కొందరు ఆమెపై విమర్శలు చేస్తూనే ఉన్నారట. ఒకవైపు కమర్షియల్ సినిమాలు చేస్తూనే.. కథలకు ప్రాధాన్యం ఉన్న సినిమాల్లో నటిస్తూ.. నిత్య సౌత్ ఇండస్ట్రీలోనే ఒక ఐకానిక్ హీరోయిన్ గా నిలిచారు. ఇటీవల ఆమె 'తిరుచిత్రాంబళం' తమిళ చిత్రానికి ఉత్తమ జాతీయ నటిగా అవార్డు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఒక కమర్షియల్ సినిమాలో నటించిన హీరోయిన్ కి జాతీయ అవార్డు ఇవ్వడం ఏంటని పలు విమర్శలు గుప్పుమన్నాయి. అయితే ఇప్పటికి ఆ విమర్శలు కొనసాగుతూనే ఉన్నాయట. దీనిపై నిత్యా మీనన్ క్లారిటీ ఇస్తూ.. 'నేను జాతీయ అవార్డుల జ్యూరీని కలిశానన్నారు. వారు కేవలం నా తిరుచిత్రాంబళం చిత్రానికే కాకుండా నాలో ఉన్న కళాకారిణిని, నా కెరీర్‌ను చూసి ఈ వార్డు ఇచ్చారని. అందుకే ఈ అవార్డును చాలా గొప్పగా భావిస్తాను' అని చెప్పొకొచ్చారు. ఇక తన లుక్స్ విషయంలోనూ తరచుగా విమర్శలతో స్ట్రెస్‌ని ఎదురుకుంటానని అన్నారు. నాకు ఎలా ఉండాలనిపిస్తే ఆలా ఉంటా, కొన్ని మూవీస్‌లో నన్ను ఇలాగే ఉండాలంటూ ఫోర్స్ చేశారు.. కానీ నేను వాటికి లొంగలేదన్నారు. నా వెయిట్ గురించి కామెంట్ చేసే వాళ్ళు ఎక్కువ, మనస్ఫూర్తిగా కాంప్లిమెంట్స్ ఇచ్చేవారు తక్కువ అని తెలిపింది. అయితే సినిమాలో నా క్యారెక్టర్ ఫిట్ అయినట్లు అనిపిస్తేనే ఏదైనా ప్రాజెక్ట్‌కి ఓకే చెప్తానన్నారు. సినిమా రిజల్ట్స్ గురించి తాను ఆలోచించన్నారు. ఇక స్టోరీ అర్థం కాకపోతే ఎలాంటి సినిమాకైనా నో చెప్తానంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.